



కోటప్పకొండ ప్రాంతంలో వరి పొలం



కలగానే.. కనీస వేతనం

పదిహేనేళ్ల క్రితం నిర్ణయించిన కనీస వేతనమే ఈరోజుకూ కష్టజీవులకు అమలవుతోందంటే నమ్మగలరా? రాష్ట్రంలో అక్షరాలా అదే జరుగుతోంది. ఎప్పుడో 2010లో నిర్ణయించిన కనీస వేతనాలే కష్టజీవులు, అసంఘటితరంగ కార్మికులకు అమలవుతోంది. ఎప్పుడో 2017కి ముందే జరగవలసిన కనీస వేతన సవరణ ఇప్పటికీ జరగకపోవడంతో కష్టజీవులు, అసంఘటితరంగ కార్మికులు తీవ్ర శ్రమ దోపిడీకి గురవుతున్నారు. ఈ ఏడున్నరేళ్లలో నిత్యావసర సరుకులు, సేవల ధరలు 200 శాతానికి మించి పెరిగి, కార్మికుల జీవన వ్యయం అనేక రెట్లు పెరిగింది. అయినప్పటికీ కార్మికుల వేతనాలు మాత్రం పెంపుదలకు నోచుకోలేదు.

- వేతన మెరుగుదల కోసం కష్టజీవుల ఎదురు చూపులు
- ఇప్పటికీ పదమూడేళ్లనాటి కనీస వేతనమే దిక్కు
- గత ప్రభుత్వ హయాంలో సలహాబోర్డు ఏర్పాటు
- 2018లోనే రాష్ట్రమంతటా సలహాబోర్డు చైర్మన్
- ప్రభుత్వం మారడంతో సిఫార్సులు బుట్టదాఖలు
- జిల్లాలో 17 లక్షల మంది కష్టజీవులకు అన్యాయం

గుంటూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): 2014 తరువాత కనీస వేతన సవరణ లేకపోవడంతో కార్మికులు ఆందోళనలు చేపట్టారు. దీంతో అప్పటి టీడీపీ ప్రభుత్వం 2018లో వేతన సవరణపై కసరత్తు ప్రారంభించింది. పెరుగుతున్న ధరలు, జీవన ప్రమాణాల ఆధారంగా వేతన సవరణకు సంబంధించి నివేదికను సిద్ధం చేయాలని సలహాబోర్డును ఆదేశించింది. వేతన సలహా మండలి చైర్మన్ రామ్మోహన్‌రావు నేతృత్వంలోని బృందం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పర్యటన నిర్వహించి కార్మికులు, కార్మిక సంఘాలతో సమావేశాలు నిర్వహించింది. ఈ సందర్భంగా కనీస వేతనాన్ని 21 వేలుగా నిర్ణయించాలని కార్మిక సంఘాలన్నీ ముక్తకంఠంతో నినదించాయి. దీంతోపాటు కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను, కార్మికుల డిమాండ్లను నమోదు చేసి సలహా సంఘం వేతన సవరణపై నివేదికను సిద్ధం చేసింది. సరిగ్గా అదే సమయంలో ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో మొత్తం ప్రక్రియ (మిగతా 8వ పేజీలో..)

ధాన్యం ధర పతనం

- పది రోజుల్లో బస్తాకు రూ. 400 తగ్గించేశారు
- చోద్యం చూస్తున్న పౌరసరఫరాల శాఖ
- కొనుగోలు కేంద్రాల ఊసెత్తని వైనం
- ఉమ్మడి జిల్లాలో 4.49 లక్షల ఎకరాల్లో వరి సాగు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి) ఖరీఫ్‌లో అన్నదాతలు విస్తృతంగా వరి సాగు చేశారు. దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయి. వరి నూర్పిడులు ప్రారంభమయ్యాయి. తెనాలి ప్రాంతం, పల్నాడు జిల్లాలోని నకరికల్లు, ఈపూరు, రాజుపాలెం మండలాల్లో వరి నూర్పిడులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఎకరాకు 30 నుంచి 40 బస్తాలు (75కిలోలు) ధాన్యం దిగుబడి వస్తోందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అయితే ధాన్యం చేతికొచ్చే సమయానికి ధర తగ్గిపోతుండటంతో అన్నదాతలు ఆవేదనకు లోనవుతున్నారు. వ్యాపారులు ఒక్కసారిగా ధరను తగ్గించి వేశారు. పది రోజుల వ్యవధిలోనే బస్తా కు రూ 400 వరకు ధర తగ్గించారు. మద్దతు ధర కన్నా కూడా బస్తాకు రూ 300 నుంచి రూ 400 వరకు మార్కెట్‌లో ధర తక్కువగా ఉండడం గమనార్హం. రైతుకు ధాన్యం వచ్చే సమయంలో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుకు మద్దతు ధర వచ్చేలా చేయాలి. కానీ పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాలో ఎక్కడా కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాలేదు. గత ఏడాది సాగు నీటి కరువుతో రైతులు వరి సాగును కోల్పోయారు. ఈ ఏడాది సకాలంలో సాగు నీటి సరఫరా చేయడంతో వరి సాగుకు రైతులు మొగ్గు చూపారు. సాగర్ ఆయకట్టులో (మిగతా 6వ పేజీలో..)

పైసలిస్తేనే.. పీఎఫ్ రుణం

పల్నాడు జిల్లా ఫిరంగిపురం మండలంలో పనిచేసే ఓ ఉపాధ్యాయుడు రూ. 5లక్షల రుణం కావాలని జిల్లా పరిషత్ (జడ్పీ) పీఎఫ్ కార్యాలయానికి దరఖాస్తు చేసుకున్నాడు. వాస్తవంగా నెలలోపు రుణం మంజూరు కావాలి....అయితే డిప్యూటీ సీఎం వద్ద పనిచేసే ప్రత్యేక అధికారి జోక్యంతోనే రుణం మంజూరు అయింది... బాపట్ల ప్రాంతానికి చెందిన మరొక ఉపాధ్యాయుడు కుమార్తె వివాహం కోసం రుణం కావాలని దరఖాస్తు చేశాడు... దరఖాస్తు చేసి నెలలు గడుస్తున్నా రుణం మాత్రం మంజూరు కాలేదు. జడ్పీ సిబ్బంది పెట్టే కొర్రీలకు ఆయన విసుగెత్తిపోయి చివరకు అంతో ఇంతో ముట్టజెప్పి రుణం పొందాల్సిన దుస్థితి.. మరొక ఉపాధ్యాయుడు రిటైర్‌మెంట్ బెనిఫిట్ కోసం చేసిన దరఖాస్తుకు ఇప్పటి వరక అతీగతి లేదు. చివరకు ఉపాధ్యాయుల డెత్ క్లయిమ్ దరఖాస్తులు క్లియర్ చేయడానికి పర్సంటేజీలు లేనిదే పనికావడం లేదని ఉపాధ్యాయ సంఘాలు ధ్వజమెత్తుతు న్నాయి. ఇలా ఆరునెలల్లో దాదాపు రూ. 100 కోట్లు క్లయిమ్‌లకు జడ్పీ సిబ్బంది కొర్రీలు వేసి వెనక్కి పంపారని వారు ఆగ్రహం వెలిబుచ్చుతున్నారు.



- మంజూరులో జడ్పీ సిబ్బంది కాసులు వేట
- మెడికల్ సర్టిఫికెట్స్ పేరుతో బేరాలు
- ఆరు నెలల్లో రూ.100కోట్లుపైగా చెల్లింపులకు కొర్రీలు

గుంటూరు(విద్య),నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో స్థానిక సంస్థల యాజమాన్యాల్లో(జడ్పీ, మండల పరిషత్) పనిచేసే ఉపాధ్యాయులు దాదాపు 10వేల మందికిపైగా ఉన్నారు. ఆయా ఉపాధ్యాయులు తమ జీతం నుంచి కొంత మొత్తం జడ్పీ పీఎఫ్ అకౌంట్‌లో జమచేస్తారు. ఇందులో రూ.5వేల నుంచి రూ.25వేల వరకు ఉపాధ్యాయులు తాము తీసుకుంటున్న జీతాల ఆధారంగా ఈ మొత్తం జమచేస్తారు. ఈ మొత్తాల నుంచి అవసరమైన వారు రుణాలు తీసుకుంటారు. ఉపాధ్యాయుల పిల్లల వివాహాలు, ఉన్నత చదువులు కోసం, ఇంటి నిర్మాణం కోసం, వైద్య బిల్లులు చెల్లింపులు ఇతరత్రా ఆర్థిక అవసరాల కోసం రుణాలు తీసుకుంటారు. జడ్పీ పీఎఫ్ అకౌంట్‌లో ఉన్న తమ డబ్బునే వారు రుణాల రూపంలో తీసుకుంటారు. అయితే ఈ రుణాలు చెల్లింపుకు జడ్పీలో ఈ అండ్ ఎఫ్ విభాగాలు కీలకంగా పనిచేస్తాయి. ప్రాథమిక (మిగతా 8వ పేజీలో..)

మలుపు... తలుపులు తెరవరూ..

చెప్పులు కుట్టి జీవనం సాగించే చర్మకారుల కోసం ఏర్పాటు చేసిన మలుపు కేంద్రం (లెదర్‌పార్కు) ముళ్ల పొదల్లో నిరుపయోగంగా శిథిలావస్థకు చేరుకుంది. టీడీపీ ప్రభుత్వం ఎస్సీ యువతకు మలుపు కేంద్రం ద్వారా శిక్షణ ఇచ్చి వారి జీవితంలో వెలుగులు నింపాలని భావించి ఏర్పాటుచేసిన కేంద్రం, తరువాతి ప్రభుత్వాల నిరాదరణ కారణంగా మూలన పడింది. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే మలుపు కేంద్రం మూతపడినా, ఇక్కడ పనిచేసే సిబ్బంది ఎక్కడ ఉన్నా ఇప్పటికీ జీతాలు చెల్లిస్తున్నారు.

- నిరుపయోగంగా లెదర్ పార్కు
- వినియోగంలోకి వస్తే యువతకు ఉపాధి
- ఇప్పటికీ సిబ్బందికి జీతాల చెల్లింపు
- కూటమి ప్రభుత్వంపై స్థానికుల ఆశలు

ప్రభుత్వం నిదులు విడుదల నిలిపివేయడంతో శిక్షణ కేంద్రం మూలన పడింది.

దుర్గి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) 2001 - 2003 మధ్య పల్నాడు ప్రాంతంలో మావోయిస్టుల ఉనికి తీవ్రంగా ఉండేది. ఇక్కడి యువత సరయిన ఉపాధి అవకాశాలు లేక నిరాశ నిస్పృహలతో సతమవుతున్న పరిస్థితులలో, మావోయిస్టులకు ఆశ్రయమిస్తూ సానుభూతిపరులుగా మారుతూ మావోయిస్టుల వైపు ఆకర్షితులవుతున్నట్లు అప్పటి టీడీపీ ప్రభుత్వం గుర్తించింది. అప్పటి, ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పల్నాడు ప్రాంతంపై దృష్టి సారించారు. యువత పెడదారి పట్టకుండా ఉండాలని, పెడదారి పడితే రాష్ట్రాభివృద్ధికి ఆటంకమవుతుందని భావించి వారి బంగారు భవిష్యత్తుకు మార్గం చూపాలని తలంచారు. అడిగొప్పుల సమీపంలో మలుపు కేంద్రం ఏర్పాటు చేయాలనే సంకల్పంతో మావోయిస్టుల ప్రభావం ఉన్న ఈ ప్రాంతంలో ప్రభుత్వ ఆధీనంలోని హార్టీకల్చర్‌పాంకు చెందిన భూముల్లో మినీ లెదర్ పార్కు నిర్మాణానికి 30 ఎకరాలు కేటాయించారు. భవన నిర్మాణానికి రూ. కోటి మంజూరు చేశారు. 2003లో అప్పటి వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి కోడెల శివప్రసాదరావు మినీ లెదర్ పార్కు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నిర్మాణం శరవేగంగా జరుగుతున్న సమయంలో ఎన్నికలు రావడంతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో నిర్మాణ పనులు నిలిచిపోయాయి.

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో...

చర్మకారులు, ప్రజా సంఘాల నేతల ఆధ్వర్యాన పలు ఆందోళన కార్యక్రమాలు చేపట్టడంతో 2004 సంవత్సరం ముగిసే సమయానికి భవన నిర్మాణాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేసి ప్రారంభించింది. చెప్పులు, బూట్లు తయారీ కోసం రూ.25లక్షల వ్యయంతో అధునాత యంత్ర సామగ్రిని తెప్పించి యువతకు శిక్షణ మొదలుపెట్టారు. మొదటి బ్యాచ్‌గా 150మంది చర్మకారులకు శిక్షణనిచ్చారు. ఈ శిక్షణ పొందిన యువతకు ఎస్సీ కార్పోరేషన్ ద్వారా రుణం మంజూరుచేసి వారు తయారుచేసిన చెప్పులు, బూట్లు అమ్ముకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఆ తర్వాత



ఈ తలుపు తెరుచుకునేదెన్నడో..



మలుపు కేంద్రంలోని లోపలి భాగం

కూటమి ప్రభుత్వంపై కోటి ఆశలు..

మలుపు కేంద్రం చతికల పడడంతో యువతకు ఉపాధి ప్రశ్నార్థకంగా మారింది. 30 ఎకరాల్లో ఒక ఎకరం స్థలంలో మలుపు కేంద్రం నిర్మాణం జరగగా, గత వైసీపీ ప్రభుత్వం ఎకరం స్థలాన్ని జగనన్న కాలనీకి కేటాయించింది. కాగా మిగిలిన స్థలంలో కొంత భాగాన్ని రైతులు సాగు చేసుకుంటున్నారు. అయితే కేంద్రం మూతపడి 14 సంవత్సరాలు గడుస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారని చర్మకారులు ఆవేదన చెందుతున్నారు. ఇందులో విచిత్రమైన మలుపు ఏంటంటే మలుపు కేంద్రానికి సంబంధించిన టెక్నికల్ నిపుణులు, అధికారులకు వారు ఎక్కడ ఉన్నా, పనిచేయకపోయినా ఇప్పటికీ జీతాలు చెల్లిస్తూనే ఉన్నారు. మలుపు కేంద్రం వద్ద నామమాత్రంగా కాంట్రాక్ట్ వాచ్‌మెన్ ఉన్నారు. కూటమి ప్రభుత్వం రాకతో చర్మకారుల్లో మరలా కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. దళితుల అభివృద్ధికి కృషి చేసే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తమ జీవితాల్లో వెలుగు నింపాలని ఎదురుచూస్తున్నారు. ఇటీవల కాలంలో లిడ్ క్యాప్ చైర్మన్‌గా నియయితులైన పిల్లి మాణిక్యరావు మలుపు కేంద్రంపై దృష్టి పెట్టాలని స్థానికులు కోరుకుంటున్నారు.



దళిత యువతకు జీవనోపాధి కల్పించాలి



అడిగొప్పుల లెదర్‌పార్కు పునఃప్రారంభించి దళిత యువతకు జీవనోపాధి కల్పించారు. మలుపు కేంద్రం ప్రారంభించి యువతకు శిక్షణా తరగతులు నిర్వహిస్తే ఈ ప్రాంతంలో 10 వేల మంది జీవితాల్లో వెలుగులు నిండుతాయి. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దీనిపై దృష్టి సారించాలి.

- పులిమెల నాగేశ్వరరావు, చర్మకారుల సంఘు నేత

కూటమి నేతలపై కోటి ఆశలు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో దళిత యువత కోటి ఆశలు పెట్టుకుంది. వారి ఆశలకు అనుగుణంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు త్వరితగతిన లెదర్‌పార్కును ప్రారంభించి ఇక్కడి చర్మకారుల జీవితాల్లో వెలుగులు నింపాలి.

- పేరుపోగు రామయ్య, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు

భోజనం చల్లగా ఉందని అడిగినందుకు..

- అసభ్యకరంగా దూషించిన వార్డెన్
- అందుకే విద్యార్థినుల ఆత్మహత్యాయత్నం
- ఎమ్మెల్యే, అధికారుల విచారణలో సహచర విద్యార్థినుల వెల్లడి

సత్తెనపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): హాస్టల్ వార్డెన్ వేధింపులు తాళలేక ఇద్దరు విద్యార్థినులు ఆత్మహత్యకు ప్రయత్నించిన సంఘటనపై సోమవారం తహసీల్దార్ చక్రవర్తి, పల్నాడు జిల్లా ఇంటర్మీడియెట్ బోర్డు అధికారి నీలావతి పట్టణంలోని 22వ వార్డు వెంకటపతి కాలనీలోని సాంఘిక సంక్షేమ కళాశాల బాలికల వసతి గృహంలో విద్యార్థినులను విచారించారు. సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ విచారించారు. శనివారం రాత్రి భోజనం చల్లగా ఉంది, ఇదేంటని? వార్డెన్ రాణిని విద్యార్థినులు అఖిల, సవిత ప్రశ్నించారని, మీ ఇంట్లో ఇంతకన్నా మంచి భోజనం దొరుకుతుందా అని వార్డెన్ రాణి అసభ్యకర పదజాలంతో దూషించిందని, దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన సదరు విద్యార్థినులు ఇద్దరూ డోలో - 650 మాత్రలు చెరో ఎనిమిది వేసుకొని వసతి గృహంలోనే పడుకున్నారని కొందరు విద్యార్థినులు వారికి వివరించారు. కొద్ది సేపటికి ఇద్దరూ వాంతులు చేసుకుంటుండటంతో ఏమైందని తాము అడగ్గా టాబ్లెట్లు ఎక్కువగా వేసుకున్నామని, అందువల్ల వాంతులు అవుతున్నాయని చెప్పారన్నారు. వెంటనే ఈ విషయాన్ని తాము వాచ్‌మన్‌కు చెప్పగా వార్డెన్‌కు ఫోన్ చేసి సమాచారం అందించారనీ, వారిరువురిని వార్డెన్ చికిత్స నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించి అనంతరం మెరుగైన చికిత్స కోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారని విద్యార్థినులు వారికి తెలిపారు. వార్డెన్ మెనూ ప్రకారం భోజనం పెట్టడంలేదని, కోడిగుడ్లు ఇవ్వటం లేదని, పండ్లు కూడా సక్రమంగా ఇవ్వటం లేదని, టిఫిన్ కూడా సక్రమంగా సరఫరా చేయడం లేదని విద్యార్థినులు ఫిర్యాదుచేశారు. విద్యార్థినులు చేసిన ఫిర్యాదులపై ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని తహసీల్దార్ చక్రవర్తి తెలిపారు. కొంతమంది విద్యార్థినులు వార్డెన్ రాణి వ్యవహార శైలిపై రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఉదయం వండిన అన్నం సాయంత్రం, సాయం త్రం వండిన అన్నం తెల్లవారుజామున పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలియజేశారు. అధికారుల వెంట పట్టణ అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్లు ధర్మసింగ్ శాస్త్రి, ఆసియాలు ఉన్నారు.

విద్యార్థినులకు ఎమ్మెల్యే కన్నా పరామర్శ

సాంఘిక సంక్షేమ కళాశాల విద్యార్థినులు వసతి గృహంలో ఆత్మహత్యకు యత్నించి గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న ఇద్దరు విద్యార్థినులను సోమవారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పరామర్శించారు. విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. హాస్టల్ వార్డెన్ రాణి నిర్లక్ష్యం కారణంగా విద్యార్థినులు ఆత్మహత్యకు ప్రయ త్నించటం బాధాకరమన్నారు. వస తి గృహంలో భోజనం బాగోలేదని వార్డెన్‌పై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినందుకు ఏదో ఒక వంకతో రెండు రోజుల నుంచి వార్డెన్ ఇబ్బంది పెడుతున్నట్టు విద్యార్థినులు తెలిపారన్నారు. విద్యార్థిని సవిత తల్లిదండ్రులు రెండు రోజుల క్రితం వార్డెన్ వ్యవహార శైలిపై పోలీసు స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేసినట్టు తెలిపారన్నారు. అక్కడే ఉన్న వార్డెన్ పై కూడా ఆయన మండి పడ్డారు.

న్యాయాధికారుల విచారణ

విద్యార్థినులు ఆత్మహత్యకు యత్నించిన సంఘటనపై సివిల్ జడ్జిలు తౌషిత్ హుస్సేన్, మహమ్మద్ గౌస్ సోమవారం సాయంత్రం వసతి గృహా న్ని సందర్శించి విద్యార్థినులతో మాట్లాడారు. అక్కడ జరిగిన విషయాలను అడిగి తెలుసు కున్నారు. విద్యార్థినులు పలు అంశాలను న్యాయాధికారులకు వివరించారు. పరిసరాలను వారు పరిశీలించారు. వారితోపాటు ప్యానల్ న్యాయవాది బీఎల్ కోటేశ్వరరావు ఉన్నారు. విద్యార్థినుల ఆత్మహత్యాయత్నానికి కారణమైన వార్డెన్ రాణిమ్మను వెంటనే విధుల నుంచి తప్పించాలని గిరిజన విద్యార్థి సేన రాష్ట్ర అధ్యక్షుడు కేతావతు పాండు నాయక్ డిమాండ్ చేశారు.



గుంటూరు వైద్యశాలలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



బాలికల వసతి గృహంలో విద్యార్థినులను విచారిస్తున్న న్యాయాధికారులు

వీరుల ఉత్సవాల పోస్టర్లు ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

కారంపూడి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కారంపూడి పట్టణంలో ఈ నెల 30వ తేదీ నుంచి నిర్వహించనున్న వీరుల ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేస్తామని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. సోమవారం కారంపూడిలో వీరుల ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఐదు రోజులపాటు ఈ ఉత్సవాలు జరుగుతాయన్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా వసతులను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచి సరస్వతిబాయి, బాలునాయక్, పంగులూరి అంజయ్య, పుల్లయ్య చప్పిడి రాము, మునుగోడు సత్యం, గోళ్ల సురేష్ యాదవ్, బొల్నేడి శ్రీనివాసరావు, కటికల బాలకృష్ణ, తండా మస్తాన్‌జాని, మాజీ ఎంపీపీ నాగులు నాయక్, బొమ్మిని శేషగిరి, రాముడు, దోర్నాల బ్రహ్మారెడ్డి, గాడిపత్రి పూర్ణయ్య, తోట నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్ ఫోర్స్ మాజీ ఉద్యోగి సీకే రావుకు ఘన నివాళి



పుష్పగుచ్ఛం ఉంచి శ్రద్ధాంజలి ఘటిస్తున్న ఎయిర్ ఫోర్స్ సిబ్బంది

అచ్చంపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎయిర్ ఫోర్స్ మాజీ ఉద్యోగి సీకే రావు(60) అనారోగ్యంతో ఆదివారం అచ్చంపేటలో మృతి చెందారు. సీకే రావు ఎయిర్ ఫోర్సులో ఉద్యోగం చేసి పదవీ విరమణ పొందారు. బాపట్ల సూర్యలంక ఎయిర్ ఫోర్స్ స్టేషన్ నుంచి ఆరుగురు బృందం వచ్చి సీకే రావు భౌతికకాయంపై పుష్పగుచ్ఛం ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. భౌతికకాయంపై గౌరవ సూచికంగా త్రివర్ణ పతాకం ఉంచారు. సార్జంట్(ఎస్‌జీటీ) పవన్ నేతృత్వంలో శ్రద్ధాంజలి ఘటించారు. చిత్తూరు జిల్లా పుత్తూరులోని ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) చల్లా జానకి, పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సతీమణి భాష్యం లావణ్య సీకే రావు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, పలువురు టీడీపీ నాయకులు మృతుని కుటుంబానికి సంతాపం తెలిపారు.

రైలు కింద తల పెట్టి ఆత్మహత్య

తెనాలి క్రైం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తి కదులుతున్న రైలు కింద తలపెట్టి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం తెనాలి రైల్వే స్టేషన్‌లో చోటు చేసుకుంది. జీఆర్‌పీ ఎస్‌ఐ జి.వెంకటాద్రి తెలిపిన వివరాల మేరకు.. సుమారు 30-35 సంవత్సరాల మధ్య వయసు కలిగిన గుర్తుతెలియని వ్యక్తి ఐదో నంబరు ప్లాట్‌ఫారంపై కదులుతున్న జన్మభూమి ఎక్స్‌ప్రెస్ కింద తలపెట్టి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి చెందిన వ్యక్తిగత సమాచారం లభించకపోవడంతో కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సీఆర్డీఏ భూముల్లో సాగు చేయవద్దు

- త్వరలో రాజధాని పనులు ప్రారంభం
- గ్రామాల్లో అధికారుల ప్రచారం



అనంతవరంలో ప్రచారం చేస్తున్న సీఆర్డీఏ యూనిట్ తహసీల్దార్ రవి బాబు

తుళ్లూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): 'త్వరలో రాజధాని పనులు పునఃప్రారంభమవుతున్నాయి. ఆ పనులకు ఎటువంటి అడ్డంకులు కలిగించవద్దు. వేసిన పంటలు తొలగించుకోండి.. సీఆర్డీఏ భూముల్లో ఎటువంటి సాగు తలపెట్టవద్దు.' అని సీఆర్డీఏ అధికారులు రాజధాని గ్రామాల్లో తిరిగి సోమవారం ప్రచారం నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతవరం గ్రామంలో యూనిట్ తహసీల్దార్ రవిబాబు, ఫెసిలిటేటర్స్ రైతులకు పంటలు వేయవద్దని తెలిపారు. రాజధాని గ్రామాల్లో కొంతమంది సీఆర్డీఏ భూములు ఆక్రమించి సాగు చేస్తున్నారని, ఇక నుంచి అటువంటి వాటికి తావు లేదని సీఆర్డీఏ అధికారులు స్పష్టం చేశారు. కాదని సాగు చేస్తే కేసులు నమోదు చేయడమేగాక, పంట నష్టం కూడా జరుగుతుందని తెలిపారు. ఈ విషయాలను గ్రామాల్లో రైతులు ప్రచారం చేసి రాజధాని నిర్మాణ పనులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఎవరైనా ఆక్రమించి సాగు చేస్తున్నట్టు తెలిస్తే తుళ్లూరు సీఆర్డీఏలో ఫిర్యాదు చేయాలని అధికారులు కోరారు.

ధాన్యం ధర పతనం

(5పేజీ తరువాయి)

కాలువల చివరి భూముల్లో గత నెలలో వరి నాట్లు పూర్తయ్యాయి. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 4.49 లక్షల ఎకరాల్లో వరి సాగైనట్టు వ్యవసాయ శాఖ ప్రకటించింది. గత ఏడాది కంటే వరి సాగు గణనీయంగా పెరిగింది. పల్నాడు జిల్లాలో 87,740 ఎకరాల్లో వరి సాగు చేశారు. బాపట్ల జిల్లాలో 2,20,903 ఎకరాలు, గుంటూరు జిల్లాలో 1,40,935 ఎకరాల్లో వరి సాగయింది. సగటున ఎకరాకు 30 బస్తాలు అంటే 22.50 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. అన్ని ప్రాంతాల్లో ఈ నెలాఖరుకు ముమ్మరంగా వరి నూర్పిడిలు జరగనున్నాయి.

ధాన్యం రైతుల ఇంటికి చేరే సమయానికి వ్యాపారులు ధరలు తగ్గించి వేస్తున్నారు. 10 రోజులు క్రితం వరకు సన్నాలు రకం ధాన్యం 75 కిలోల బస్తా ధర రూ 1,800 ఉంది. ప్రస్తుతం ధరను రూ. 1,600లకు తగ్గించివేశారు. బీపీటీ రకం ధాన్యం ధర దారుణంగా ఉంది. ఈ రకం బస్తా ధాన్యం పల్నాడు జిల్లాలో రూ. 1,300 కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తెనాలి ప్రాంతంలో బీపీటీ బస్తా ధాన్యం రూ. 1,440 వ్యాపారులు కొనుగోలు చేశారని రైతులు తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర మార్కెట్‌లో రైతులకు దక్కడంలేదు. క్వింటా ధాన్యంకు రూ 2,320 మద్దతు ధర ఉంది. అంటే 75 కిలోల బస్తాకు మద్దతు ధర రూ 1,740. మార్కెట్‌లో మద్దతు ధర లభించకపోతుండటంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నకరికల్లు మండలం నరసింగపాడు.. త్రిపురాపురం, రాజుపాలెం మండలం నెమలిపూరి, తెనాలి ప్రాంతాల్లో ముమ్మరంగా వరి నూర్పిడులు జరుగుతున్నాయి. మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోలేదు. నేటి వరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో మార్కెట్‌లో ధాన్యం అమ్ముకొని రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. బీపీటి ధాన్యం మద్దతు ధర కన్నా బస్తాకు రూ 440కు తక్కువగా వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. తెలంగాణకు ధాన్యం ఎగుమతులు లేని కారణంగా ధర తగ్గిందని వ్యాపారులు చెబుతున్నారు. ధర పతనం అయిన సమయంలో పౌరసరఫరా శాఖ రంగంలోకి దిగి రైతులును ఆదుకోవాల్సి ఉంది. ఈ ప్రయత్నాలు జరగుతున్న దాఖలాలు లేవు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ఊసే ఎత్తడంలేదు. నేటి వరకు ఒక్క కేంద్రం కూడా ప్రారంభం కాలేదంటే రైతులు పట్ల నిర్లక్ష్య వైఖరిని తెలియజేస్తోంది. ఇంకా ధాన్యం రాలేదన్న వాదనను అధికారులు వినిపిస్తున్నారు. తెనాలి ప్రాంతంలో గత రెండు రోజుల్లో వ్యాపారులు దాదాపు 10 లారీల ధాన్యం కొనుగోలు చేశారు. పల్నాడు జిల్లాలో కూడా కొనుగోళ్లు జరగుతున్నాయి. ఇవేవి పౌరసరఫరాల శాఖకు కనిపించకపోవడం గమనార్హం. గిట్టు బాటు ధర మాట ఎలా ఉన్నా కనీసం మద్దతు ధర లభించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

'పెమ్మసాని' జోక్యంతో సీసీఐలో కదలిక

- జనరల్ మేనేజర్‌పై కేంద్రానికి ఫిర్యాదు చేసిన మంత్రి
- పత్తి కొనుగోళ్ల పర్యవేక్షణకు సీనియర్ అధికారి నియామకం

గుంటూరు సిటీ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇన్ని రోజులు పత్తి కొనుగోలు ప్రక్రియలో ఏర్పడిన ప్రతిష్ఠంభనకు కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చొరవతో తెరపడింది. పెమ్మసాని జోక్యంతో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్‌లో పత్తి కొనుగోలు వ్యవహారం లో జరుగుతున్న తాత్సారంపై ప్రత్యేక దృష్టి సారించింది. రాష్ట్రంలో పత్తి కొనుగోలు ప్రక్రియను ప్రత్యేకంగా పర్యవేక్షించేందుకు సీసీఐలోని సీనియర్ అధికారిని నియమించారు. గుంటూరు నగర పరిధిలోని సీసీఐ కేంద్రాలను కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ శుక్రవారం సందర్శించారు. ఆ సందర్భంగా పత్తి అమ్మకాల విషయంలో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పలువురు రైతులు మంత్రి దగ్గర ఆవేదన చెందారు. పత్తి కొనుగోలుపై గుంటూరు సీసీఐ జనరల్ మేనేజర్ నిరాసక్తత ప్రదర్శిస్తున్నారని, తమను ఉద్దేశపూర్వకంగా ఇబ్బంది పెడుతున్నారని రైతులు ఈ సందర్భంగా పెమ్మసాని దృష్టికి తీసుకువెళ్లారు. ఆంధ్రాలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పెమ్మసాని చంద్రశేఖర్ కేంద్ర జౌళీ శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్, సీసీఐ సీఎండీ గుప్తా దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన కేంద్ర ప్రభుత్వం సీసీఐ సీనియర్ అధికారిని రంగంలోకి దింపింది. పత్తి కొనుగోళ్లకు ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది. పత్తి కొనుగోళ్లను పూర్తిస్థాయిలో ప్రారంభించాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేయగా, పూర్తిస్థాయిలో కొనుగోలు ప్రారంభిస్తామని రైతులకు భరోసా ఇచ్చింది. పత్తి కొనుగోలు వ్యవహారంలో మంత్రి పెమ్మసాని చూపించిన చొరవపై రైతుల్లో హర్షం వ్యక్తం అవుతుంది.

మిస్టరీగా బాలుడి మృతి


- ఈతకు వెళ్లి బావిలో మృతి
- పోలీసులకు ఫిర్యాదు ఇవ్వని బంధువులు
- ఆలస్యంగా వెలుగులోకి

తాడికొండ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తొమ్మిదో తరగతి చదువుతున్న బాలుడు మృతి మిస్టరీగా మారింది. గ్రామస్తులు తెలియజేసిన వివరాల ప్రకారం.. 9వ తరగతి చదువుతున్న షేక్ సమీర్‌కు తల్లిదండ్రులు చనిపోవటంతో తాడికొండ మండలం పొన్నెకల్లు గ్రామంలోని నాయనమ్మ, మేనమామ ఇంటి వద్ద ఉంటూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్నాడు. అక్టోబరు 24న పాఠశాలకు వెళ్లకుండా సమీర్ ఇంటి వద్దనే ఉన్నాడు. అయితే అదే రోజు మధ్యాహ్నం పాఠశాలలో విద్యార్థులకు డ్రిల్ పిరియడ్ నిర్వహించారు. కొంతమంది విద్యార్థులు డ్రిల్ పిరియడ్‌ను మానేసి ఈత కొట్టడానికి గ్రామ పొలిమేరలో ఉన్న బావి వద్దకు వెళ్తూ సమీర్‌ను తీసుకువెళ్లారు. ఈత కొట్టే క్రమంలో సమీర్ బావిలోని బురదలో ఇరుక్కుపోయాడు. సమీర్ ఎంతసేపటికి పైకి రాకపోవటంతో విద్యార్థులు భయంతో అక్కడ నుంచి వెళ్లిపోయారు. సమీర్ బావిలో పడిపోయాడు అనే విషయం గ్రామస్తులు, బంధువుల దృష్టికి రావటంతో బావి వద్దకు చేరుకుని గాలించారు. ఎంతసేపటికి జాడ తెలియకపోవడంతో ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని బావిలోకి గాలం వేసి వెతికారు. అయినా ఆచూకీ లభ్యం కాకపోవటంతో బావిలో నీటిని ఇంజన్లతో బయటకు తోడి సమీర్ మృతదేహాన్ని వెలికితీశారు. అనంతరం పోలీసులు, గ్రామస్తులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తీసుకువెళ్లమని చెప్పినప్పటికీ బంధువులు ఒప్పుకోకపోవటంతో బాలుడి స్వగ్రామం అమరావతి మండలం కర్లపూడికి తరలించారు.

బంధువుల ఆరోపణలు..

సమీర్ శరీరంపై రక్తపు గాయాలు ఉన్నాయని, తోటి విద్యార్థులు విచక్షణా రహితంగా కొట్టి బావిలో పడేశారని బంధువులు ఆరోపిస్తున్నారు. విషయాన్ని ఆ గ్రామ సర్పంచి దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం మస్తాన్‌బీతో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయించారు. అయితే విచారణ ఏవిధంగా సాగిందో లేదో తెలియని పరిస్థితి. బాలుడు మృతిపై విచారణ చేయటానికి జిల్లా ఉప విద్యాధికారి వెంకటేశ్వరావు సోమవారం పొన్నెకల్లు జిల్లా పరిషత్ పాఠశాలకు వచ్చారు. బాలుడు మృతిపై సమగ్ర విచారణ చేపట్టి డీఈవోకు నివేదికలు అందజేస్తానని తెలిపారు. బాలుడు మృతిపై తాడికొండ సీఐ కె.వాసును వివరణ కోరగా సమీర్ మృతి చెందిన రోజు పోస్టుమార్టంకు తీసుకువెళ్తామని చెప్పినప్పటికీ బంధువులు ఒప్పుకోలేదని తెలిపారు. కనీసం ఫిర్యాదు కూడా ఇవ్వలేదన్నారు. సోమవారం ఉన్నదికారులు బంధువుల వద్ద నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేసి ఫిర్యాదు తీసుకోవాలని ఆదేశించగా వారి వద్దకు వెళ్లి బాలుడు మృతిపై ఫిర్యాదు ఇవ్వాలని కోరాగా ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు ఇవ్వలేదని చెప్పారు. దీంతో సమీర్ మృతి మిస్టరీగా మారింది.

గల్లంతైన సత్యనారాయణ మృతదేహం లభ్యం



సత్యనారాయణ (ఫైల్)

రెంటచింతల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని కృష్ణానదిలో గల్లంతైన మిర్చి వ్యాపారి నీలా సత్యనారాయణ (62) మృతదేహం సోమవారం లభ్యమైనట్లు ఎస్‌ఐ సీహెచ్ నాగార్జున చెప్పారు. తుమ్మకోటకు చెందిన నీలా సత్యనారాయణ, పద్మావతి దంపతులు రెంటచింతలలో కొంతకాలం నుంచి నివాసముంటున్నారు. ఈ నెల 16న నదిలో కార్తీక స్నానమాచరించే క్రమంలో భార్య పద్మావతి నీళ్లలోకి జారిపోతున్న క్రమంలో రక్షించడానికి భర్త సత్యనారాయణ తీవ్రంగా ప్రయత్నించి గల్లంతైయ్యాడు. భార్య పద్మావతి మృతదేహం లభ్యంకాగా, సత్యనారాయణ మృతదేహం కోసం గాలిస్తుండగా, సోమవారం లభ్యమైంది. భార్యభర్తలకు పోస్టుమార్టం నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు.

ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి వినతితో..

ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి వినతికి టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు ఎస్‌ఈ కె.వెంకటరమణ, శ్రీశైలం చీఫ్ ఇంజనీర్ కాంతారావు సానుకూలంగా స్పందించారు. ఆదివారం రాత్రి 10 గంటల 10 నిమిషాల నుంచి రెండు టర్బయిన్ల నుంచి విద్యుదుత్పత్తిని నిలిపి వేయడం వలన నదిలోకి వెళ్లే 8800 క్యూసెక్కుల నీరు నిలిచిపోయింది. దీంతో నదిలో ప్రవాహ వేగం తగ్గడం వలన సోమవారం సత్యనారాయణ మృతదేహం లభ్యమైంది.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

అమరావతి, నవంబరు 18: మండల పరిధిలోని దిడుగు గ్రామ సమీపంలో ద్విచక్రవాహనంపై అమరావతి వైపు వస్తున్న అచ్చంపేట మండలం కొండూరుకు చెందిన కుంభా శ్రీనివాసరావు(45)ను గుర్తుతెలియని వాహనం సోమవారం ఢీకుంది. ఆయన చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుని కుటుంబ సభ్యులు ఆర్టీసీ బస్సు ఢీకొనడం వలనే శ్రీనివాసరావు మృతి చెందాడని ఆరోపిస్తున్నారు. అమరావతి వైపు నుంచి వస్తున్న శ్రీనివాసరావు వాహనానికి వెనుక వైపు నుంచి వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలైయ్యాయి. వెంటనే అతన్ని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి ద ర్యాప్తు చే స్తున్నారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

భారీగా డీఎల్‌డీవోల బదిలీలు

గుంటూరు సిటీ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో పెద్ద ఎత్తున డీఎల్‌డీవోల (డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్) బదిలీలు జరిగాయి. సోమవారం పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ జీవో విడుదల చేసింది. ప్రకాశం జిల్లా కందుకూరు డీఎల్‌డీవో కె.శ్రీదేవిని తెనాలిలో నియమించారు. డీఎల్‌డీవో సి.హనుమంతరావును డ్వామా పీడీ కార్యాలయంలో నియమించారు. డీఎల్‌డీవో డి. వెంకట్రావును బాపట్ల ఈటీసీ ప్రిన్సిపాల్‌గా నియమించారు. తెనాలి డీఎల్‌డీవో పి. పద్మజను బాపట్ల ఈటీసీ వైస్ ప్రిన్సిపాల్‌గా నియమించారు. ప్రకాశం జిల్లా డ్వామా పీడీ కార్యాలయంలో ఏవోగా పనిచేస్తున్న సీహెచ్ విజయలక్ష్మిని బాపట్ల డీఎల్ డీఓ గా నియమించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.75
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	114, 122,133
చికెన్ విత్ స్కిన్	216.00
చికెన్ స్కిన్ లెస్	226.00

విజ్ఞాన్ యూనివర్సిటీలో వైభవంగా 'ఉద్భవ్ 2కే24'



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డాక్టర్ సుశీల్ కుమార్

గుంటూరు(విద్య), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో జాతీయ స్థాయి మేనేజ్‌మెంట్ మీట్ 'ఉద్భవ్ -2కే24' వేడుకలను సోమవారం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని క్రైజెన్(కీ టు ఆంబీషియస్ అండ్ ఇంటెలెక్చువల్ జోన్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ నోవల్టీ)స్కూల్ ఆఫ్ లా అండ్ మేనేజ్‌మెంట్ విభాగంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథి విశాఖపట్నంలోని ఐఐఎం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సుశీల్ కుమార్ మాట్లాడుతూ సాంకేతిక అంతరాయాలు, ప్రపంచీకరణ, మారుతున్న సామాజిక అంచనాల కారణంగా నిర్వహణ రంగం ఎలా అభివృద్ధి చెందుతుందో చర్చించారు. నేటి డైనమిక్ వ్యాపార వాతావరణంలో నిరంతర అభ్యాసం ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. మరో ముఖ్య అతిథి హైదరాబాద్‌లోని మైక్రో ల్యాబ్స్ లిమిటెడ్ సేల్స్ మేనేజర్ వీసీ. మరళీ క్రిష్ణ రాజ్ మాట్లాడుతూ కార్పొరేట్ ప్రపంచంలో తన వ్యక్తిగత ప్రయాణాన్ని విద్యార్థులతో పంచుకున్నారు. హైదరాబాద్‌లోని డ్రీమ్‌ప్లగ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ డిప్యూటీ మేనేజర్, పూర్వ విద్యార్థి రాఘవేంద్ర పొన్నగంటి మాట్లాడుతూ ఇన్నోవేషన్, ఎంట్రప్రెన్యూర్‌షిప్, నెట్‌వర్కింగ్ విషయాలను వివరించారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వర్సిటీ వైస్ ఛాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దుర్గి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): దుర్గిలో మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ డీఈఈ రామయ్య తెలిపారు. విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల పనులు జరుగనున్నందున విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఆయన తెలిపారు. వినియోగదారులు సహహరించాలని డీఈఈ రామయ్య కోరారు.

జోన్ డైరీ

● పిడుగురాళ్ల ఆర్టీసీ డిపోలో మంగళవారం 11 గంటల నుంచి 12 గంటల వరకు 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ కోటేశ్వరరావు తెలిపారు. ప్రయాణీకులు, ప్రజలు 9959225430 నెంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదులు, సలహాలను తెలియజేయాలని డిపో మేనేజర్ సూచించారు.

● సత్తెనపల్లి పట్టణంలోని అన్ని సచివాలయాల్లో ఈనెల 19 నుంచి 22వ తేదీ వరకు, 26వ తేదీ నుంచి 29వ తేదీ వరకు ఆధార్ నమోదుకు ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసినట్లు మునిసిపల్ కమిషనర్ షమ్మి సోమవారం విలేకరులకు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

● అమరావతిలోని పెద్దింటమ్మ ఆలయ సమీపంలో శ్రీగీతా వెంకటేశ్వర వేద పాఠశాలను 20వ తేదీన ప్రారంభిస్తున్నట్లు పాఠశాల వ్యవస్థాపక నిర్వాహకులు ఘంటసాల చంద్రమౌళి శర్మ తెలిపారు. వేద పాఠశాలలో ప్రతి రోజు అన్నసంతర్పణ కార్యక్రమం జరుగుతుందని అన్నారు.

మండల సమాఖ్య

అధ్యక్షురాలిగా నాగలక్ష్మీ

అమరావతి, నవంబరు 18: వెలుగు మండల సమాఖ్య అధ్యక్షురాలిగా అమరావతికి చెందిన చింకా నాగలక్ష్మీ, కార్యదర్శిగా ఎస్ మరియమ్మ, కోశాధికారిగా కోల్నాటి భాగ్యలక్ష్మీ, ఉపాధ్యక్షురాలిగా పద్మాల శివకుమారి, సహాయ కార్యదర్శిగా బీ.బాలమ్మ ఎన్నికైనట్లు ఏపీఎం కృష్ణప్రియ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నకరికల్లు ఏపీవోగా పుష్పరాజ్

నకరికల్లు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామి పథకం నకరికల్లు ఏపీవోగా కే పుష్పరాజ్‌ను బదిలీ చేశారు. ఇప్పటి వరకు ఇక్కడ ఏపీవోగా పని చేస్తున్న సుందరరావును నాదెండ్ల మండలానికి బదిలీ చేశారు.

ఎరువుల షాపులో తనిఖీ

నకరికల్లు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నకరికల్లులోని మన గ్రోమోర్ సెంటర్‌లో ఏవో కే దేవదాసు సోమవారం తనిఖీ చేశారు. మూడు ఎరువుల నమూనాలను సేకరించి నాణ్యత పరీక్షల నిమిత్తం ప్రయోగశాలకు పంపారు. ఎరువుల నిల్వలను, స్టాక్ రిజిస్టర్‌ను, బిల్లు బుక్స్‌ను తనిఖీ చేశారు.

వైస్ సర్పంచ్‌గా అబ్దుల్ రజాక్

బెల్లంకొండ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : బెల్లంకొండ గ్రామ వైస్ సర్పంచ్‌గా కొండవీటి అబ్దుల్ రజాక్(చిట్టి) సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతంలో పనిచేసిన వైస్ సర్పంచ్ మునగపాటి సుభానీ అనివార్య కారణాలతో రాజీనామా చేయగా పంచాయతీలో 13 మంది వార్డు సభ్యులు అబ్దుల్ రజాక్‌ను వైస్ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పంచాయతీ సెక్రటరీ తెలిపారు.

దెబ్బతిన్న వరి పొలాలను

పరిశీలించిన తహసీల్దార్

బెల్లంకొండ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండంలలోని నాగిరెడ్డిపాలెం ఎర్రబాలెం మేజరు కుడి కాలువకు గండి పడటంతో దెబ్బతిన్న వరి పొలాలను బెల్లంకొండ తహసీల్దార్ ఆస్రిపున్నీసా బేగం సోమవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ పంట కోతకు వచ్చే సమయంలో గండి పడటం వలన సుమారుగా 15 ఎకరాల పంట నష్టం జరిగిందని అంచనా వేశామని, ఈ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. ఆమె వెంట మండల వ్యవసాయశాఖ అధికారి కృష్ణయ్య, రెవెన్యూ అధికారి వెంకయ్య,మండల కోర్ కమిటీ సభ్యులు వెన్నా సీతారామిరెడ్డి, వెంకట రామిరెడ్డి, లక్ష్మారెడ్డి ఉన్నారు.

ఎరువులు కొనుగోలు చేసిన రైతుకు

పక్కాగా బిల్లులు ఇవ్వాలి

బెల్లంకొండ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : దుకాణంలో ఎరువులు కొనుగోలు చేసిన రైతుకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని మండల వ్యవసాయ శాఖ అధికారి కృష్ణయ్య తెలిపారు. సోమవారం మండలంలోని నాగిరెడ్డిపాలెం పలు దుకాణాల్లోని ఎరువుల నిల్వలను ఆయన పరిశీలించి నాణ్యత పరీక్షల నిమిత్తం మూడు రకాల ఎరువుల నమూనాలను సేకరించారు. బిల్లు పై రైతు సంతకం తప్పనిసరిగా ఉండాలని, స్టాక్ నిల్వ, ధరలు బోర్డులు ఏర్పాటు చేయాలని డీలర్లకు సూచించారు. ప్రతి రైతుకు ఆధార్‌తో ఎరువులు కొనుగోలు చేయాలని సూచించారు. ఈ తనిఖీల్లో వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ నిలయం.. సమస్యల వలయం

● ఎస్సీ కళాశాల వసతి గృహాల్లో బాలికల అవస్థలు
● కిటికీలు, బాత్‌రూంలు తలుపులు లేని దైన్యం
● అమలుకి నోచుకోని మెనూ..
● కడుపు మాడ్చుకుంటున్న విద్యార్థినులు
● ప్రశ్నించిన వారిపై వార్డెన్ వేధింపులు
● విద్యార్థినుల ఆత్మహత్యాయత్నంతో ఉలికిపాటు


పట్టణంలోని ఎస్సీ కళాశాలల బాలికల వసతి గృహం

సత్తెనపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఎస్సీ కళాశాల బాలికల వసతి గృహంలో సమస్యలు ఎన్నో ఉన్నాయి. పలు కిటికీలకు అద్దాలు పగిలి పోయి రాత్రి సమయాల్లో విద్యార్థినిలు చలికి, దోమలకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ వసతిగృహంలో ఇంటర్ నుంచి డిగ్రీ వరకు కళాశాలల బాలికలు విద్యను అభ్యసిస్తున్నారు. వసతి గృహంలో బాత్‌రూంలకు తలుపులు సక్రమంగాలేక విద్యార్థినులు పడుతున్న బాధ వర్ణనాతీతం. ఇక్కడ మెను కూడా సక్రమంగా అమలు కావటం లేదు. వార్డెన్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

మెనూ అమలు అస్తవ్యస్తం..

విద్యార్థినిలకు వారానికి ఏడు రోజులు గుడ్లు పెట్టాల్సి ఉండగా రెండు రోజులు మాత్రమే ఇస్తున్నారు. చిక్కీ ఇవ్వాల్సి ఉండగా సక్రమంగా ఇవ్వటం లేదు. పండ్లు కూడా సక్రమంగా అందించటం లేదు. ఉదయం పూట మిగిలిన అన్నం,కూరలు సాయంత్రంవేళల్లో, సాయంత్రం వేళ మిగిలిన అన్నం, కూరలు తెల్లవారిన తర్వాత పెడుతున్నారు. టిఫెన్ కూడా మెను ప్రకారం విద్యార్థినిలకు అందించటం లేదు. ఎవరైనా విద్యార్థినిలు గట్టిగా ప్రశ్నిస్తే వార్డెన్ రాణి వారిని వేధింపులకు గురి చేస్తుండేది. దీనివలన విద్యార్థినిలు ఎవ్వరూ బయటకు చెప్పుకోలేక పోతున్నారు. ఆమె పర్య వేక్షణ లోపం పూర్తిగా ఉంది. వంట మనుషుల మీద పూర్తిగా బాధ్యతలు వదిలి వేయటం వల్ల వారు కూడా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూండేవారు. తప్పనిసరి పరిస్థితుల్లో ఎంతో కొంత తిని అర్థాకలితో పండుకున్న సందర్భాలు అనేకం ఉన్నాయని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గతంలోనూ వార్డెన్‌పై ఫిర్యాదులు..

వార్డెన్‌పై సంబంధిత ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవటంతో పాటు, మెను అమలుచేయాల్సిన ఉంది. గతంలో వార్డెన్ రాణెమ్మపై ఫిర్యాదులు రావడంతో నూ అధికారులు వసతి గృహాన్ని సందర్శించి ఆమెను హెచ్చరించిన పరిస్థితి ఉంది. అయినప్పటికీ ఆమె తీరు మార్చు కోలేదు. వార్డెన్ వేధింపులు తాళలేక ఆదివారం ఇద్దరు విద్యార్థినులు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తల్లిదండ్రును ఉలికిపాటుకి గురిచేసింది. ఈ ఘటన తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

● బుగ్గవాగు క్రస్ట్ గేట్ల మరమ్మతులకు రూ.60 లక్షలు విడుదల
● ఎమ్మెల్యే జూలకంటి వెల్లడి



బుగ్గవాగు డ్యాం క్రస్ట్ గేట్లు, ఎమ్మెల్యే జూలకంటి

రెంటచింతల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రైతులు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందులో భాగంగా 57 సంవత్సరాల తర్వాత బుగ్గవాగు రెండు క్రస్ట్ గేట్ల మరమ్మతులకు ఎస్‌డీఆర్ఎఫ్ (రాష్ట్ర విపత్తుల నిర్వహణ నిధి) నుంచి రూ.60 లక్షలు సీఎం చంద్రబాబు మంజూరు చేశారని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తెలిపారు. సోమవారం అసెంబ్లీ సమావేశాలకువెళ్తున్న ఎమ్మెల్యే రెంటచింతలలో విలేకరులతో మాట్లాడుతూ.. బుగ్గవారు ఆరు క్రస్ట్ గేట్లకు గాను 2, 4 నెంబరు గేట్ల మరమ్మతులకు నిధుల విడుదలయ్యాయని తెలిపారు. 1967 సంవత్సరంలో కాలువలకు నీటిని విడుదల చేసిన తర్వాత ఈ స్థాయిలో నిధులు విడుదల చేయడం ఇదే ప్రథమమన్నారు. అలాగే రెంటచింతల నుంచి జెట్టిపాలెం రహదారి మరమ్మతులకు రూ.15 లక్షలు, రెంటాల రహదారికి రూ.15 లక్షలు, దుర్గి నుంచి కాకిరాలకు రూ.20 లక్షలు, మెయిన్ రోడ్డు నుంచి అనుపులోని నది వరకు రూ.15 లక్షలు, ఒప్పిచర్ల నుంచి మిర్యాల అడ్డరోడ్డు వరకు రూ.60 లక్షలు, నరమాలపాడు కాలనీ నుంచి ఒప్పిచర్ల వరకు రూ.30 లక్షలు, చినగార్లపాడు నుంచి లక్ష్మీపురం కు రూ.15 లక్షలను ఎస్‌డీఎంఎఫ్ నుంచి మంజూరైనట్లు తెలిపారు. ఆర్ అండ్‌బీ రహదారులకు నిధులు మంజూరులో మాచర్ల నియోజకవర్గం మూడవ స్థానంలో వుందని ఇప్పటికే రూ.117.70 కోట్లు విడుదల చేశారని ఆయన పేర్కొన్నారు. మాచర్ల అభివృద్ధిపై సీఎం చంద్రబాబుకున్న ప్రత్యేక శ్రద్ధకు ఈ నిధుల విడుదల ఒక నిదర్శనమని ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి తెలిపారు.

మౌలిక వసతులను మెరుగుపర్చాలి

● అసెంబ్లీ సమావేశాల్లో పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్


అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక సౌకర్యాలను, విద్యా, వైద్య సదుపాయాలను మరింత మెరుగుపర్చాల్సిన అవసరం ఉందని, అందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం మంజూరు చేయాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. సోమవారం అసెంబ్లీలో జీరో అవర్‌లో ఆయన మాట్లాడుతూ మండల కేంద్రాల్లోని పీహెచ్‌సీలను అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆస్పత్రులకు నూతన భవనాల నిర్మాణం, ఆధునిక సౌకర్యాల కల్పనకు నిధులు కేటాయించాలని, గైనకాలజిస్టుల టార్గెట్‌లను రద్దు చేయాలన్నారు. మండల కేంద్రంలోని ఆస్పత్రులను అభివృద్ధి చేసేందుకు కార్యాచరణ సిద్ధచేశామని, అందుకు అవసరమైన నిధులను కేటాయించాలని కోరారు. పెదకూరపాడులో రూ.10 కోట్లతో నిర్మించిన ఆస్పత్రి భవనం నిరుపయోగంగా ఉందని, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని, గత ప్రభుత్వ నిర్లక్ష్యపాలన కారణంగా కనీస సౌకర్యాలులోపించి ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. ఇప్పటికీ విద్యుత్‌సౌకర్యం లేని గ్రామాలు ఉన్నాయని వాపోయారు. ప్రభుత్వ అధికారులకు వైసీపీ ప్రభుత్వ వాసన ఇంకాపోలేదని, పంచాయతీ, సచివాలయ వ్యవస్థను వేరుగాచూపి ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా సంబంధితశాఖ మంత్రులు ఉద్యోగులకు ఆదేశాలు జారీ చేయాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ కోరారు.

నేడు ఉద్యోగ మేళా

మాచర్లటౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్, ట్రైనింగ్ ఆధ్వర్యాన మంగళవారం పట్టణంలోని ఎస్‌కేబీఆర్ డిగ్రీ కళాశాలలో ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి తమ్మాజీరావు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ఉద్యోగ మేళాలో హిటిరో డ్రగ్స్, ఐసీఐసీఐ బ్యాంకు, స్పందన స్ఫూర్తి ఫైనాన్స్, కెఎల్ టెక్నికల్ సర్వీసెస్ తదితర కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, డిప్లొమా, ఫార్మసీ, పీజీ విద్యనభ్యసించి 18 నుంచి 35 సంవత్సరాల వయసుగల వారు అర్హులన్నారు. రెజ్యూమ్, ఎడ్యుకేషన్ సరిఫికెట్ జిరాక్స్, ఆధార్ నకలు, పాస్‌పోర్టుసైజు ఫోటోతో ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు 7842747682, 9492158153 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

మౌలిక వసతులు కల్పించాలి

దాచేపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని సీపీఐ కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని సీపీఐ నేతలు డిమాండ్‌చేశారు. సోమవారం ఆ కాలనీ ప్రజలతో కలసి వారు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఇంటి పట్టాలు, రహదారులు, విద్యుత్, తాగునీటి వసతులు కల్పించాలని నినదించారు. అనంతరం 1వ సచివాలయంలోని అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి షేక్ హుస్సేన్, కొమెర వెంకటరావు, బుర్రికృష్ణారెడ్డి, సత్యనారాయణ, గాలీషా, యడ్ల భాస్కర్, కోళ్లూరి నరసింహారావు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన

సత్రశాల కృష్ణానది తీరం

రెంటచింతల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం మూడవ సోమవారాన్ని పురస్కరించుకుని కృష్ణానది ఒడ్డున గల సత్రశాల శ్రీగంగాభ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి వార్ల ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ముందుగా పవిత్ర కృష్ణానదిలో కార్తీక స్నానాలు ఆచరించిన భక్తులు, అనంతరం స్వామివారిని దర్శించుకుని పూజలుచేశారు. రెంటచింతల శివాలయంలోని అయ్యప్ప కళ్యాణ మండపంలో దేవరశెట్టి దుష్యంత్,ధనలక్ష్మి దంపతులు 350 మందికి అన్నదానం చేశారు. సత్రశాలలో కామనబోయిన గంగులుయాదవ్, లింగయ్య మున్నా వెంకటేశ్వర్లుయాదవ్‌లు 1500 మందికి అన్నదానం చేసినట్లు ఈవో రామిరెడ్డి తెలిపారు.

ఆలయంలో ఎమ్మెల్యే కన్నా పూజలు

సత్తెనపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కట్టావారిపాలెం ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వార్షిక బ్రహ్మోత్సవాల్లో సోమవారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్బంగా ఆలయ నిర్వాహకులు కన్నాను దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. ఆయనవెంట టీడీపీ మండల నేతలు పలువురు ఉన్నారు.

అలాగే పట్టణంలోని అచ్చంపేట రోడ్డు శివాలయం సెంటరు వద్ద విఘ్నేశ్వర అయ్యప్ప భక్త బృందం ఏర్పాటు చేసిన అయ్యప్ప స్వామి తృతీయ మండల పూజా మహోత్సవంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైభవంగా దేవతామూర్తుల కల్యాణం



స్వామివార్ల కల్యాణానికి ముత్యాలు తీసుకువెళ్తున్న యరపతినేని నిఖిల్, అమరేశ్వరాలయంలో జమ్మిచెట్టుకి పూజలు చేస్తున్న భక్తులు

దాచేపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లిలోని అంకమ్మతల్లి దేవస్థానంలో 9 మంది దేవీ దేవరలకు కల్యాణం నిర్వహించారు. సోమవారం కార్తీక మాసాన్ని పురస్కరించుకొని అంకమ్మతల్లి ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో జరిగిన కల్యాణానికి వేలాదిగా భక్తులు హాజరయ్యారు. పార్వతీ పరమేశ్వరులు, లక్ష్మీనారాయణలు, లక్ష్మీ నరసింహస్వామి, శ్రీదేవి,భూదేవి సమేత శ్రీనివాసులు, సీతారాములు, రుక్మిణీ కృష్ణులు దేవతామూర్తులకు అతి వైభవంగా కల్యాణం నిర్వహించారు.

కోటి దీపోత్సవం .. కార్తీక మాసాన్ని పురస్కరించుకొని కల్యాణం అనంతరం కోటి దీపోత్సవాన్ని ఆలయ కమిటీ భక్తుల సహకారంతో అతివైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాగి నరసింహమూర్తి, పుల్లాభట్ల మారుతీ, భరద్వాజ్ తదితరులు వేదపఠనం గావించారు. టీడీపీ యువనేత యరపతినేని సాయినిఖిల్ హాజరై కల్యాణానికి ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. అనంతరం స్వామివార్ల కల్యాణంలో పాల్గొన్నారు. సుమారు 4 వేల మందికి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

గురజాలటౌన్, (ఆంధ్రజ్యోతి): గురజాల దైద బిలంలో వేంచేసియున్న గంగాపార్వతి సమేత అమరలింగేశ్వరస్వామిని సోమవారం గురజాల ఎమ్మెల్యే యరపతినేని తనయుడు నిఖిల్ దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

అమరేశ్వరాలయంలో కార్తీక దీపారాధనలు

అమరావతి(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం 3వ సోమవారం సందర్భంగా భక్తులు అమరేశ్వరాలయాన్ని సందర్శించి కార్తీక దీపాలు వెలిగించారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. విజయనగరం జిల్లా నెల్లిమర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే (జనసేన పార్టీ) లోకం మాధవి, స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌లు సోమవారం అమరేశ్వరాలయాన్ని సందర్శించారు. వీరికి ఆలయ అర్చకులు ఆశీర్వచనం, తీర్థప్రసాదాలు అందజేశార. అలాగే బీజేపీ పల్నాడు, బాపట్ల జిల్లాల అధ్యక్షులు ఆలోకం సుధాకర్‌బాబు, వీవీ కృష్ణారెడ్డిలు అమరేశ్వరుని సందర్శించారు. పలు విషయాలపై ఆలయ అధికారులతో చర్చించారు. వీరివెంట బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, నేతలు వెంకటేశ్వరరావు, మద్ది ధాత్రినారాయణ, హనుమంతరావు ఉన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తపై దాడి

● అధికారులే చేయించారని బాధితురాలి ఆరోపణ

దుర్గి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్తపై దుర్భాషలాడుతూ మహిళలు దాడి చేసిన సంఘటన సోమవారం మండలంలోని పోలేపల్లిలో జరిగింది. పోలేపల్లిలోని 3వ నంబరు అంగన్‌వాడీ కేంద్రానికి మధ్యాహ్నం ఒంటిగంటకు సీడీపీవో సరళ, సూపర్‌వైజర్ నాగేంద్రమ్మలు వచ్చారు. కేంద్రంలో మహిళలతో కొద్దిసేపు మాట్లాడారు. అనంతరం బయటకు వచ్చిన మహిళలు సదరు అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్త పిచ్చమ్మను దుర్భాషలాడుతూ ఆమెపై దాడిచేశారు. గాయపడిన పిచ్చమ్మను మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతోంది. ఈఘటనపై పిచ్చమ్మ మాట్లాడుతూ.. సీడీపీవో సరళ, సూపర్‌వైజర్ నాగేంద్రమ్మలు తనను ఉద్యోగం మాన్పించి మరొకరిని నియమించాలని చూస్తున్నారని, అందుకు తాను ఒప్పుకోక పోవడంతో పలువరి మహిళలతో తనపై దాడి చేయించారని ఆరోపించారు. సీడీపీవో సరళ పిచ్చమ్మ ఆరోపణలను ఖండిస్తూ.. పిచ్చమ్మపై వేధింపులకు పాల్పడలేదని, పిచ్చమ్మ సరిగా విధులు నిర్వహించడం లేదని మహిళలు తమ దృష్టికి తీసుకొచ్చారని, అప్పటికే పిచ్చమ్మ అంగన్‌వాడీకేంద్రం నుంచి వెళ్లిపోయిందని, తానూ అక్కడి నుంచి వచ్చేశానని, తానున్నప్పుడు అక్కడా ఏ దాడి జరగలేదని తెలిపింది.

టీడీపీ సభ్యత్వ నమోదు

రాజుపాలెం, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజుపాలెం గ్రామంలో సోమవారం నిర్వహించిన టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ కుమారుడు, గుంటూరు మాజీ మేయర్ కన్నా నాగరాజు పాల్గొని పలువురికి సభ్యత్వ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో సుమారు మొత్తంగా 43 వేల మంది ఓటర్లు ఉన్నారని, వారిలో 39 వేల మంది టీడీపీ సభ్యత్వం తీసుకునేలా స్థానిక నేతలు నాయకత్వం కృషి చేయాలని కోరారు. అలాగే సభ్యుడిగా నమోదైన వారికి పార్టీ అందించే ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులడు పల్లపాటి పెద్దిరాజు, మాజీ ఎంపీపీ గుత్తా వెంకట్రావు, నేతలు అంచుల నరసింహరావు, షేక్ అల్లాబక్షు, జంగం రాజా, నర్రా రమేష్, లంకా వీరయ్య, మాజీ సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల కోసం ఆందోళన

కారంపూడి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక సచివాలయం వద్ద సోమవారం సుమారు 500 మంది పేదలు తమకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యాన సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ మాచర్ల ఏరియా కార్యదర్శి మేకపోతు శ్రీనివాసరెడ్డి, మండల కార్యదర్శి షేక్ సైదాలు మాట్లాడుతూ.. సొంత ఇల్లు లేకపోవడంతో పేదలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, ఇంటి అద్దెలు కట్టలేక అల్లాడిపోతున్నారని, వారందరికి ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం సర్పంచ్ బాణావత్ సరస్వతిబాయికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఐ నేతలు పాల్గొన్నారు.

బాలనాగేంద్రస్వామి వార్షికోత్సవం

దుర్గి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ధర్మవరంలో వేంచేసియున్న శ్రీహరిహర బాలనాగేంద్రస్వామి 34వ వార్షికోత్సవ కార్యక్రమాలను సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భజనా కార్యక్రమం జరిపారు. ఈసందర్భంగా అన్నదానం నిర్వహించారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

పత్తి కొనుగోలు కేంద్రాలపై

రైతులకు అవగాహన

దుర్గి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పత్తి కొనుగోలు కేంద్రాలపై రైతులకు అవగాహన కల్పించాలని ఏవో అమీర్‌రెడ్డి సిబ్బందికి సూచించారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో సోమవారం వీఏఏ, వీహెచ్ఏలతో ఆయన సమావేశమై పలు సూచనలు చేశారు. పత్తి రైతులు ముందుగా సచివాలయాల్లో ఆన్‌లైన్ చేయించుకోవాలన్నారు. నాణ్యమైన పత్తికి ప్రభుత్వం రూ. 7520 మద్దతు ధర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. సమావేశంలో వీఏఏలు, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్ళు ప్రారంభం

క్రోసూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : క్రోసూరు వ్యవసాయ మార్కెట్ యార్డు ఆధ్వర్యంలో సోమవారం నుంచి పత్తి కొనుగోళ్ళు ప్రారంభమయ్యాయని మార్కెట్ యార్డు కార్యదర్శి కే.ఈశ్వరరావు తెలిపారు. ముందుగా పత్తి రైతులు రైతుసేవా కేంద్రాల్లో వారి పేర్లు నమోదు చేసుకోవాలని, తర్వాత సత్తెనపల్లి సమీపంలోని ధూళ్ళిపాళ్ళ వద్దనున్న విజయచైతన్య ఎంటర్ ప్రైజెస్ మిల్లుకు పత్తిని తరలించాలని తెలిపారు. 8నుంచి 12శాతం లోపు తేమ ఉన్న పత్తికి మాత్రమే మద్దతు ధర లభిస్తుందన్నారు. క్వింటాకు కనిష్ఠ ధర రూ.7,121 నుంచి గరిష్ఠ ధర రూ.7,521 వరకు ఉందన్నారు. లూజు పత్తిలో తేమ 12 శాతం మించకుండా ఉండాలని, గన్నీ బ్యాగ్ నందు మాత్రమే పత్తిని తీసుకు రావాల్సి ఉంటుందన్నారు. క్రోసూరు మార్కెట్ యార్డు పరిధిలోని క్రోసూరు, పెదకూరపాడు, బెల్లంకొండ, అచ్చంపేట, అమరావతి మండలాలకు చెందిన పత్తి రైతులు ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని తెలిపారు.

భూ సమస్యల పరిష్కారానికి కృషి

జే. మధుబాబు
పిడుగురాళ్ల మండల తహసీల్దారు

ఫటాఫట్


మధుబాబు
పిడుగురాళ్ల తహసీల్దారు

పిడుగురాళ్ల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రైతులు భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని, స్థానికంగా వీఆర్వోల స్థాయిలో సమస్య పరిష్కారం కానప్పుడు తనను నేరుగా కలిసి సమస్యలను విన్నవించవచ్చని పిడుగురాళ్ల తహసీల్దారు జే.మధుబాబు రైతులకు సూచించారు. రెవెన్యూ పరిధిలోని పలు అంశాలపై ఆంధ్రజ్యోతి ప్రతినిధితో 'ఫటాఫట్..'

ప్ర: రెవెన్యూ సమస్యలు ఏమైనా వున్నాయా ?

జ: గ్రామస్థాయిలో భూ రికార్డులు కొన్ని అస్తవ్యస్తంగా వున్నాయి. వాటిని సరిచేయాల్సి వుంది. రెవెన్యూ రికార్డుల్లో భూ వివరాలు నమోదు కావాలంటే సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో సచివాలయాల ద్వారా నమోదు చేసుకోవాలని, వాటిని పరిశీలించిన అనంతరం ఆన్‌లైన్‌లో నమోదు చేస్తాం.

ప్ర: పట్టాదారు పాస్‌పుస్తకాల అందజేతలో జాప్యం ఎందుకు ?

జ: భూయజమానులు తగిన ధ్రువీకరణ పత్రాలతో రెవెన్యూ అధికారులను సంప్రదించాలి. ఆ తర్వాత రికార్డులను పరిశీలించి భూమిని మ్యూటేషన్ చేయడంతో పాటు ఈ-పాస్ బుక్‌కు సిఫార్సు చేస్తాం.

ప్ర: భూమి శిస్తు వసూలు చేస్తున్నారా ?

జ: ప్రతి ఏడాది భూమిశిస్తు వసూలు చేస్తాం. ఇప్పుడు ఆన్‌లైన్‌లోనూ శిస్తు జమ చేసే విధానం అమలులో ఉంది.

ప్ర: ప్రభుత్వ భూముల పరిరక్షణ ఎలా ?

జ: మండలంలో ఎక్కడెక్కడ ప్రభుత్వ భూములు రికార్డు పరంగా వున్నాయో వాటిని గుర్తించి వాటిని సంరక్షించేందుకు గ్రామస్థాయి రెవెన్యూ అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాం.

సమస్య ఇది.. స్పందించరూ

తాగునీటికి కటకట


నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంక్

చేజర్ల కపోతేశ్వరాలయంలో తాగు నీరు లేక భక్తులు ఇబ్బంది పడుతున్నారు. ఆలయంలోని రక్షిత తాగునీటి పథకం కొన్ని నెలలుగా పనిచేయక పోవడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. కార్తీక మాసం కావటంతో దూర ప్రాంతాల నుంచి ఆలయానికి వచ్చిన భక్తులు తాగునీరులేక అవస్థపడుతున్నారు. ఆలయ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు. ఈ విషయంపై కంజర్వేటర్ అసిస్టెంట్ వెంకటయ్య స్పందిస్తూ నిధుల కొరతతో రక్షిత తాగునీటి పథకం మరమ్మతు చేయించలేక పోయామని, త్వరలోనే తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. - నకరికల్లు (ఆంధ్రజ్యోతి)

డివైడర్‌పై ముళ్ల చెట్లు


డివైడర్‌పై వాలిన ముళ్ల చెట్లు

మాచర్ల పట్టణంలోని రింగు రోడ్డు సెంటర్ నుంచి అంబేద్కర్ పార్కు వరకు ప్రధాన రహదారిపై గల డివైడర్‌పై ముళ్ల చెట్లు ఏపుగా పెరిగి రహదారిపైకి వాలి పోయి వాహన దారులకు తగులుతూ ఉండటంతో వారు గాయాలపాలవుతున్నారు. మునిసిపల్ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు. - మాచర్లటౌన్ (ఆంధ్రజ్యోతి)


గురజాలలో ఆటల పోటీలకు హాజరైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

కొనసాగుతున్న గ్రంథాలయ వారోత్సవాలు

● వివిధ పాఠశాలల్లో విద్యార్థులకు క్విజ్, ఆటల పోటీలు

గురజాలటౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం గ్రంథాలయ అధికారిణి హిమభార్గవి ఆధ్వర్యాన పట్టణంలోని ప్రభుత్వోన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

క్రోసూరు, (ఆంధ్రజ్యోతి): క్రోసూరు గ్రంథాలయంలో హిందీ పండిట్ షేక్ సుభానీ, బండారు మైసూర్‌బాబులు విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి వీరాంజమ్మ పర్యవేక్షించారు.

దుర్గి,(ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. పలు పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీలను ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, షేక్ అబ్బాస్, కొండలు, గ్రంథాలయ అధికారులు వేణుగోపి, మెర్సీ తదితరులు పర్యవేక్షించారు.

రాజుపాలెం(ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనగా, క్విజ్ మాస్టర్‌గా విశ్రాంతి లెక్చరర్ మహేశ్వరరావు వ్యవహరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రసాద్,బాబు, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దళిత యువకులపై కేసులను ఎత్తి వేయాలి

పెదకూరపాడు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): దళిత యువకులపై లగడపాడు గ్రామానికి చెందిన రావెల బుచ్చయ్య చౌదరి, మనీష్‌లు పెట్టిన అక్రమ కేసులను ఎతివేయాలని కోరుతూ కుల నిర్మూలన పోరాట సమితి నేతలు సోమవారం తహసీల్దార్ మీసాల డానియేలుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కే కృష్ణ మాట్లాడుతూ అగ్రకుల పెత్తందారి శక్తుల, అధికారపార్టీ నేతల ఒత్తిళ్ళకు లొంగి దళిత యువకులపై పెట్టిన తప్పుడు కేసును రద్దు చేయకుండా సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు కాల యాపన చేస్తున్నారన్నారు. ఈ సమస్యకు పరిష్కారం చూపాలని, లేకుంటే లగడపాడులోని అంబేద్కర్ విగ్రహంవద్ద రిలే నిరాహార దీక్షలు ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ ఉపాధ్యక్షులు గొల్లపూడి చిన ప్రసాదు, ప్రగతిశీల కార్మిక సమాఖ్య నాయకులు నన్నం పోతురాజు, సీహెచ్ రాజశేఖర్, బయ్యవరపు రామయ్య, నాగిపోగి శ్రీనివాసరావు, సీపీఐ నేతలు పాల్గొన్నారు.

ఆయుధాలకు నీరాజనాలు

◆ పల్నాటి వీరుల ఆయుధాలకు ఉత్సవాలు ◆ కారంపూడిలోని యుద్ధభూమిలో ఆయుధ పూజ ◆ 30 నుంచి డిసెంబరు 4 వరకు వీరారాధన ఉత్సవాలు

దేశంలో.. ప్రపంచంలో పురాతన కాలం నుంచి నేటి వరకు ఎన్నో యుద్ధాలు జరిగాయి. విషాదాలు మిగిల్చాయి.. మరుగనపడిపోయాయి. కానీ ఎప్పుడో ఎనిమిది వందల నలభై సంవత్సరాల క్రితం జరిగిన యుద్ధం ఆనవాళ్లు ప్రజల మది నుంచి తొలగలేదు. నాడు యుద్ధంలో వీరులు ఉపయోగించిన ఆయుధాలు పరమ పూజ్యనీయమై నీరాజనాలు అందుకుంటున్నాయి. అదే పల్నాడు ప్రత్యేకత. ఆధిపత్యం.. అధికార దాహం.. పదవీ వ్యామోహాలతో పల్నాడులో 12వ శతాబ్దంలో జరిగిన యుద్ధం చరిత్రగా కాలగర్భంలో కలిసిపోకుండా వీరారాధన ఉత్సవాల పేరుతో ఏటా కార్తీక మాసంలో జరుగుతుంది. పల్నాడులో కత్తులు నర్తిస్తాయి. నాటి వీరుల గాథలను భక్తులు ఆలపిస్తుంటారు. 14 జిల్లాల్లోని వీరాచారవంతులు ఈ ఆయుధాలే కాక తమ పూర్వీకుల ఆయుధాలతో వీర్ల దేవాలయం వద్ద ఉన్న యుద్ధ భూమికి తీసుకొచ్చి పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పిస్తారు. 15న వీరారాధన ఉత్సవాలకు అంకురార్పణ జరిగింది. ఈ నేపథ్యంలో ఆంధ్రజ్యోతి పాఠకుల కోసం నాటి ఆయుధాలు.. వాటి నేపథ్యం.

కారంపూడి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): 12వ శతాబ్దం చివరలో కారంపూడిలో జరిగిన పల్నాటి యుద్ధానికి ఓ ప్రత్యేకత ఉంది. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా ఆనాటి పల్నాటి యుద్ధంలో వీరులు ఉపయోగించిన ఆయుధాలు పరమపూజ్యనీయమై నీరాజనాలు అందుకుంటున్నాయి. శైవ, వైష్ణవి సంఘర్షణ, పగా ప్రతీకారం, పదవీ వ్యామోహం నేపథ్యంలో 1184వ సంవత్సరంలో జరిగిన పల్నాటి యుద్ధంలో స్త్రీశక్తి ఎంత ప్రబలమైనదో నిరూపించింది. సర్వమత సమానత్వాన్ని, కుల, మత, వర్ణ రహిత సమాజాన్ని ప్రబోధించే మహోన్నత చాపకూడు సిద్ధాంతాన్ని ఆవిష్కరించింది. ఈ నెల కార్తీక అమావాస్య 30వ తేదీ నుంచి డిసెంబరు 4 వరకు ఐదు రోజులపాటు కారంపూడిలో వీరారాధన ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. కార్తీక పౌర్ణమి రోజైన శుక్రవారం రాత్రి పల్నాటి వీరారాధన ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. పల్నాటి యుద్ధంలో అమరులైన వీరుల కుటుంబాలకు తమ పూర్వీకుల ఆయుధాలతో ఉత్సవాలకు తరలిరావాలని లేఖలు పంపారు.

బ్రహ్మనాయుడి నృసింహకుంతం

బ్రహ్మనాయుడు ఉపయోగించిన ఆయుధం నృసింహకుంతం. దీనిని సామంత రాగోల అని పిలుస్తారు. త్రిశూల ఆకారంలో 64 కోణాలు కలిగి చివర విషపు ములుకులు కలిగి ఉన్న ఈ ఆయుధం విశ్వకర్మ చేత రూపొందించబడి బ్రహ్మానాయుడుకు ఆయుధంగా ఇవ్వబడిందని చరిత్ర చెబుతోంది. చాలా శక్తివంతమైంది. నరసింహస్వామి కొణతంగా పిలుస్తూ వీరారాధనకు విచ్చేసిన ఆచార వంతులు, యాత్రికులు, భక్తి ప్రపత్తులతో కొలుస్తూ కత్తిసేవ చేస్తారు. దీనిని ఉత్సవాల సమయంలో వీర్ల దేవాలయంలో, మిగిలిన సమయంలో చెన్నకేశవ స్వామి ఆలయంలో ఉంచుతారు.






బాలచంద్రుడి సామంత ఆయుధం

పల్నాటి దైవం చెన్నకేశవ స్వామి వరంగా బాలచంద్రుడికి వచ్చిన ఆయుధమే సామంతము. అలరాజును చంపిన నరసింగరాజును బాలచంద్రుడు ఈ సామంతమనే ఆయుధంతో సంహరించి తలను తన తండ్రి బ్రహ్మనాయుడుకు కానుకగా ఇచ్చాడు.

అలరాజు సూర్య భేతాళం

తన తండ్రి కొమ్మరాజు అంకాళమ్మ తల్లిని శిరస్సుపై ధరించి భక్తి ప్రపత్తులతో అమ్మవారిని సేవించగా అంకాళమ్మ వరప్రసాదిత ఖడ్గమే సూర్య భేతాళం. దీన్ని కొమ్మరాజు తన కుమారుడైన అలరాజుకు బహూకరిస్తాడు. ఈ ఆయుధంతో అల రాజు శత్రువులను చీల్చి చెండాడాడు. నాగమ్మ చేసిన విషప్రయోగంతో మరణించే సమయంలో తన ఆయుధమైన సూర్య భేతాళంను బాలచంద్రుడికి ఇవ్వమని కన్నమదాసుకు చెప్పి మరణిస్తాడు అల రాజు.



విష్ణు ముద్రిత శరాయుధం

విశేష దివ్య శక్తులు కలిగిన కొమ్మరాజు తన చేతిలో ఈ ఆయుధం ఉన్నంత వరకు ఓటమి ఎరుగడు. ఇతని ప్రధాన ఆయుధం విష్ణు ముద్రిత శరాయుధం. బాణం, బల్లె, కత్తిని సమర్థవంతంగా వాడగలిగిన అస్త్రశస్త్ర విశారదుడు కొమ్మరాజు.





పెద్దన్న బాదరాజు ముద్గరం

బ్రహ్మనాయుడు సోదరుడైన పెద్దన్న బాదరాజు ఉపయోగించిన ఆయుధం ముద్గరం. అశ్వముల కారణంగా అనుకోని విధంగా అలరాజుకు పెద్దన్న బాదరాజుకు జరిగిన పోరాటంలో బాదరాజు వాడిన ఆయుధం ముద్గరం.

నాయకురాలు నాగమ్మ వీరఖడ్గం

గురజాల రాజ్యానికి మంత్రిగా నియమితులైన నాయకురాలు నాగమ్మ తన వీరఖడ్గం శివుని ప్రసాదంగా భావిస్తారు. ఆది నుంచి శివ భక్తురాలైన నాగమ్మ ఈ ఆయుధాన్ని యుద్ధంలో ఉపయోగించి పల్నాటి సైన్యాన్ని నేలకొరిగించింది.



కన్నమదాసు భైరవఖడ్గం

బ్రహ్మనాయుడుకు మానస పుత్రుడు, పల్నాటి రాజ్య సర్వ సైన్యాధిపతి అయిన మాల కన్నమదాసు ఉపయోగించిన ఆయుధం భైరవఖడ్గం. భైరవ పోతురాజుల శక్తితో ఉద్భవించిన ఆయుధంగా భైరవఖడ్గం పేరుతో విరాజిల్లింది. ఇది దాదాపు నాలుగు అడుగుల పొడవు, ఆరు అంగుళాల వెడల్పుతో ఒంటి చేత్తో మోయడానికి వీలు లేని విధంగా ఉంటుంది. ఈ ఆయుధంతోనే కన్నమదాసు మండాది అడవుల్లో అరణ్యవాసం చేస్తున్నప్పుడు తమ గోవులను తరలించుకుపోతున్న శత్రుమూకలను చీల్చిచెండాడారు. పల్నాటి యుద్ధంలో ఈ ఖడ్గంతో ఒక వేటుతో ఆరు తలలు నరికినట్లు చరిత్ర చెబుతోంది.






మలిదేవరాజు నామాల ఆయుధం

మాచర్ల రాజ్యాధిపతి మలిదేవరాజు నామాల ఆయుధంను తరచూ ఉపయోగిస్తారు. యుద్ధ సమయంలో ఆ ఆయుధంతోనే గురజాల సైన్యాన్ని ఎదురించారు. ఇప్పటికీ ఈ ఆయుధం స్థానిక వీర్ల దేవాలయంలో వీరాచారవంతుల పూజలు అందుకుంటుంది.

వీర్ల దేవాలయం

పల్నాటి యుద్ధం అనంతరం నాగులేటి ఒడ్డున ఔరంగజేబు సైనికులు జాఫర్, పరీద్‌లు నిర్మించిన వీర్ల దేవాలయంలో భద్రపరిచిన ఆయుధాలు పూజలందుకుంటున్నాయి. ఆలయంలో ఆయుధాలు భద్రపరిచిన సైనికులు తామూ వీరులుగా ఆలయ ఆవరణలో జీవ సమాధులయ్యారు. ఈ సమాధులు ఇప్పటికీ దర్శనమిస్తున్నాయి.



కోటప్పకొండలో.. భక్తుల సందడి





త్రికోటేశ్వర స్వామికి విశేష అలంకారం

నరసరావుపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ శైవ క్షేత్రం కోటప్పకొండలో కార్తీక సోమవారం పురస్కరించుకుని శ్రీ త్రికోటేశ్వర స్వామి సన్నిధిలో భక్తుల కోలాహలం నెలకొంది. శ్రీ మేధా దక్షిణామూర్తి స్వరూప శ్రీ త్రికోటేశ్వర స్వామికి పంచామృతాలతో విశేష ద్రవ్యాలతో మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు వైభవంగా జరిగాయి. విశేష పుష్పాలకంరణ సేవ జరిగింది. తెల్లవారు జామునుంచే వేలాదిగా భక్తులు కొండకు తరలివచ్చి శ్రీ త్రికోటేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. దేవస్థానంలో భక్తుల రద్దీ నెలకొంది. ఆలయ ప్రాంగణంలో.. నందీశ్వరుని విగ్రహం వద్ద పెద్ద ఎత్తున భక్తులు దీపారాధనలు చేశారు. ఆలయ ఈవో డీ చంద్రశేఖరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆర్టీసి నరసరావుపేట, చిలకలూరిపేట నుంచి ప్రత్యేక సర్వీసులు కొండకు నడిపింది. పోలీసు శాఖ బందోబస్తు ఏర్పాటు చేసింది.

పైసలిస్తేనే.. పీఎఫ్ రుణం

(5వ పేజీ తరువాయి)

పాఠశాలల ఉపాధ్యాయుల రుణాలు ఈ విభాగంలో, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయుల రుణాలు ఎఫ్ విభాగం పర్యవేక్షిస్తుంది. ఇందులో పనిచేసే సిబ్బంది రుణాలు కోసం వచ్చిన దరఖాస్తుల్ని నిబంధనల ప్రకారం క్లియర్ చేయాల్సి ఉండగా కొర్రీలు పెట్టి పక్కనపడేస్తున్నారని ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉపాధ్యాయులు రూ. 5లక్షలకు మించి రుణం కోసం దరఖాస్తు చేస్తే సివిల్ అసిస్టెంట్ సర్జన్ నుంచి మెడికల్ సర్టిఫికెట్ తీసుకురావాలని నిబంధన పెట్టారు. ఈసర్టిఫికెట్ రుణం కోసం చేసిన దరఖాస్తుకు జత చేయకపోవడం వల్ల మీ రుణం ప్రాసెస్ చేయడం లేదని కొంతమంది సిబ్బంది ఉపాధ్యాయులకు ఫోన్లు చేసి చెబుతున్నారు. ఉపాధ్యాయులు హడావుడిగా కార్యాలయానికి వెళ్తే అక్కడ పర్సంటేజీలు మాట్లాడుకుని బేరాలకు దిగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

● జడ్పీలో పనిచేసే ఓ ద్వితీయశ్రేణి అధికారి పేరుతో పీఎఫ్ రుణాల పర్సంటేజీల దందా సాగుతున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి. ఆయన పేరు చెప్పి సిబ్బంది ఉపాధ్యాయుల నుంచి పర్సంటేజీల వారీగా అందినకాడికి దండుకుంటున్నారు.

● ఉపాధ్యాయులు మరణిస్తే ఆయన తాలుకా వచ్చే బెనిఫిట్స్ కోసం కుటుంబ సభ్యులతో జడ్పీ సిబ్బంది బేరాలు ఆడుతున్నారు. డెత్‌క్లయిమ్ క్లియర్ చేసి వచ్చే మొత్తాలు వారసులు తీసుకోవాలంటే రూ. 5వేల నుంచి రూ. 10వేల వరకు పర్సంటేజీలు ఇవ్వాల్సి వస్తోందనే ఆరోపణలు ఉపాధ్యాయ కుటుంబాల నుంచి వస్తున్నాయి.

● జడ్పీలో ఉపాధ్యాయులు పీఎఫ్ అకౌంట్లు అప్‌డేట్ చేయడం లేదు. ఫలితంగా తాము జీతం నుంచి చెల్లించిన డబ్బు పక్కదారి పడుతుందేమోనని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనేక సాంకేతిక సమస్యలున్నా వెబ్‌సైట్‌ను అప్‌డేట్ చేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

● పీఎఫ్ సొమ్ము మంజూరులో సిబ్బంది చేస్తున్న తప్పిదాలను 11 పాయింట్స్‌గా గుర్తించి గత నెల 10న ఉపాధ్యాయ సంఘాలు జడ్పీ సీఈవోకు అందజేశారు. అయితే ఆయా తప్పిదాలకు సంబంధించి ఇంత వరకు పరిష్కారం చూపలేదు. ఇలా తాము దాచుకున్న సొమ్మును ఆర్థిక అవసరాల కోసం ఉపయోగించుకోవాలంటే పర్సంటేజీలు చెల్లించాల్సిన దుస్థితి వస్తోందని ఉపాధ్యాయులు వాపోతున్నారు. ఇప్పటికైనా సమస్యలపై అధికారులు దృష్టిపెట్టాలని లేకుంటే సమస్యను సంఘాల ద్వారా విద్యామంత్రి దృష్టికి తీసుకెళ్తామని స్పష్టం చేస్తున్నారు.

కలగానే.. కనీస వేతనం

(5వ పేజీ తరువాయి)

అంతా ఆగిపోయింది.

బుట్టదాఖలు చేసిన ప్రస్తుత ప్రభుత్వం

2019 ఎన్నికల్లో నెగ్గిన వైసీపీ అధికారం చేపట్టడంతో కనీస వేతన సవరణకు మునలం వచ్చింది. కనీస వేతన సలహాబోర్డు నివేదికను బుట్టదాఖలు చేసింది. ఆ తరువాత పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన బర్రె లీలను వేతన సవరణ బోర్డుకు చైర్మన్ చేసినప్పటికీ వేతన సవరణ ప్రక్రియ ఊసెత్తిన దాఖలాలు కూడా లేవు. మాటమాత్రంగానైనా వేతన సవరణ లేకుండా గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల కాలాన్ని నెట్టేసింది.

17 లక్షల మంది ఎదురు చూపులు

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో దాదాపు 17 లక్షల మంది అసంఘటితరంగ కార్మికులు ఉన్నారు. వీరంతా వ్యవసాయం, అనుబంధ రంగాల్లో దిన కూలీలుగా, నిర్మాణ కార్మికులుగా, సున్నం, ఇటుక బట్టీల్లో, షాపింగ్ కాంప్లెక్సులు, దుకాణాలు, ప్రైవేటు కంపెనీల్లో, ఆసుపత్రుల్లో పని చేస్తున్నారు. ఎలాంటి చట్టపరమైన భద్రత, వేతన భరోసా లేని వీరికి అన్యాయం జరగకుండా, పెరుగుతున్న నిత్యావసర ధరలు, జీవన ప్రమాణాలు, జీవన వ్యయాల పెరుగుదలను అధ్యయనం చేసి, కార్మికులతో చర్చించి తదనుగుణంగా ప్రభుత్వానికి సిఫార్సులు చేసేందుకు వేతన సవరణ సలహా బోర్డును ఏర్పాటు చేశారు. వేతన సవరణ సలహా బోర్డు ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి సలహాలు, సూచనలు ఇస్తుంటుంది.

కేంద్ర ప్రభుత్వం సవరణ?

తాజాగా కేంద్ర ప్రభుత్వం కార్మికుల కనీస వేతనాన్ని సవరించినట్లు వార్తలు ప్రముఖంగా వచ్చాయి. తాజా సవరణ ప్రకారం నిర్మాణం, స్వీపింగ్, క్లీనింగ్, లోడింగ్, అన్‌లోడింగ్‌లో పనిచేసే నైపుణ్యంలేని కార్మికులకు కనీస వేతనం రోజుకు రూ. 783, నెలకు రూ. 20,358, సెమీ స్కిల్డ్ కార్మికులకు రోజుకు రూ. 868, నెలకు రూ. 22,568, నైపుణ్యం కలిగిన క్లరికల్, నిరాయుధ వాచ్‌మెన్‌కు రోజుకు రూ. 954, నెలకు రూ.24,804కు పెంచినట్లు కేంద్ర కార్మిక కమిషనర్ వెబ్‌సైట్లో సమాచారం ఉంచారు. ఇది ఎక్కడా అమలు కావడం లేదు. దీనిపై కార్మికుల్లో కూడా అవగాహన లేదు. కనీస వేతన నిర్ణయం రాష్ట్ర ప్రభుత్వాలు చేతుల్లో వుండడంతో వారంతా కనీస వేతన సవరణ చేయాలని పెద్దఎత్తున డిమాండ్ చేస్తున్నారు.

నిద్రావస్థలో కార్మిక శాఖ

కార్మికుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన కార్మికశాఖ నిద్రావస్థలో మునిగిపోయింది. కార్మికులకు కనీస వేతనం దక్కక శ్రమ దోపిడీకి గురవుతున్నా కార్మికశాఖ ఎంతమాత్రం పట్టించుకోవడం లేదు. కార్మికుల తరుపున వేతన సవరణ బోర్డుకు సమస్యను నివేదించడంగానీ, అధికారులపై ఒత్తిడి తేవడంగానీ చేయడం లేదు. కనీసం ప్రభుత్వాల ప్రకటనలను, చట్టాలను కూడా కార్మికుల దృష్టికి తీసుకువెళ్లడం లేదు. వేతన సవరణ బోర్డు నిర్లక్ష్యం, కార్మిక శాఖ నిస్తేజం జిల్లాలో 17 లక్షల మంది అసంఘటితరంగ కార్మికులకు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారు. ఇప్పటికీ గతంలో నిర్ణయించిన రూ.14 వేలే అధికారిక కనీస వేతనంగా కొనసాగుతుండడంతో వారికి శ్రమ ఫలితం దక్కడం లేదు. కూటమి ప్రభుత్వం రాకతో మళ్లీ కార్మికుల్లో వేతన సవరణ ఆశలు ఊపిరిపోసుకున్నాయి. 2018లో కూటమి ప్రభుత్వంలో సిద్ధం చేసిన నివేదిక ఆధారంగా, ఏడేళ్లలో జరిగిన మార్పులను దృష్టిలోవుంచుకుని కనీస వేతన సవరణ చేయాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

బయ్యార్ పత్తి కొనటం లేదంటూ రాస్తారోకో

జాతీయ రహదారికి ఇరువైపులా భారీగా నిలిచిన ట్రాఫిక్



జాతీయ రహదారిపై ట్రాక్టర్లు అడ్డంపెట్టి రాస్తారోకో చేస్తున్న రైతులు

నాదెండ్ల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తేమశాతం, గుడ్డికాయ పేరుతో సీసీఐపత్తి కొనుగోలు చేయకపోవటంపై రైతులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. గణపవరం గ్రామంలోని వెంకట కృష్ణ కాటన్ మిల్లులో నిర్వహిస్తున్న సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం ఎదుట జాతీయ రహదారిపై పత్తి బోరాల ట్రాక్టర్లు అడ్డుపెట్టి రాస్తారోకో నిర్వహించారు. సుమారు గంటపాటు జరిగిన రాస్తారోకోతో రోడ్డుకు ఇరువైపులా భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. రైతులు తెలిపిన వివరాల ప్రకారం గత శుక్రవారం ట్రాక్టర్లతో రైతులు సీసీఐ కేంద్రానికి పత్తిని తరలించారు. పత్తిని చూసిన సీసీఐ అధికారులు తేమ 12 శాతంకు పైగా ఉన్నందున తాము కొనలేమని, ఇళ్ల వద్ద ఆరబెట్టుకొని రావా లని తిరస్కరించారు. సోమవారం కూడా రైతులకు అదే పరిస్థితి ఎదురైంది. నాలుగు రోజులుగా ట్రాక్టర్లను అక్కడే పెట్టుకొని పడిగాపులు కాచిన రైతులు బయ్యర్ రమేష్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరసనగా జాతీయ రహదారిపై ఇరువైపులా ట్రాక్టర్లను అడ్డం పెట్టి రాస్తారోకో చేశారు.

తేమశాతం అటుఇటుగా ఉన్నా కొంటాం..

సమాచారం తెలుసుకున్న రూరల్ సీఐ సుబ్బనాయుడు, ఎస్ఐలు పుల్లారావు, రహ్మతుల్లాలు సంఘటనా స్థలానికి వచ్చి రైతులతో మాట్లాడారు. జాతీయ రహదారిపై ధర్నా చేయటం తగదని రైతులకు వివరించారు. బయ్యర్‌తో మాట్లాడి సమస్య పరిష్కరించుకుందామని సీఐ సుబ్బనాయుడు చెప్పటంతో ఆందోళన విర మించారు. అనంతరం బయ్యర్‌తో సీఐ, రైతులు సమావేశమయ్యారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకే పత్తిని కొనుగోలు చేస్తున్నామని, తేమ, గుడ్డిపత్తి ఎక్కువగా ఉంటే తాను కొనలేనని బయ్యర్ రమేష్ తేల్చి చెప్పారు. ఈ విషయమై సీసీఐ జనరల్ మేనేజర్ అమర్నాథ్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. రైతులతో మాట్లాడిన ఆయన తేమశాతం కొద్దిగా అటుఇటుగా ఉన్నా కొనుగోలు చేస్తామని, ఎక్కువ ఉంటే కొనలేమని తెలిపారు. ఈ సమస్య విషయాన్ని మంత్రులు పెమ్మసాని చంద్రశేఖర్, అచ్చెం నాయుడు, సీఎండీల దృష్టికి తీసుకు వెళ్లారని జీఎం వివరించారు. రైతులు సహకరించాలని కోరారు.

సీసీఐ కేంద్రాన్ని సందర్శించిన జేడీ

రైతుల ఆందోళన విషయం తెలుసుకున్న వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు సోమవారం సాయంత్రం సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ట్రాక్టర్లలో ఉన్న పత్తి తేమ శాతాన్ని పరిశీలించారు. ఆరబెట్టిన పత్తిని లూజు రూపంలో గాని, గన్నీ బస్తాల్లో గాని కేంద్రానికి తీసుకురావాలని సూచించారు. రైతుల వద్ద పత్తి ఉన్నంత కాలం సీసీఐ కేంద్రం ఉంటుందని ఆయన రైతులకు భరోసా ఇచ్చారు. ఆయనతో పాటు యార్డు కార్యదర్శి యోగేశ్వరరావు ఉన్నారు.

మకరంద విన్యాసం





ఆహ్లాదకరమైన కార్తీమాస చల్లటి వాతావరణంలో ప్రకృతిలో ప్రతి అణువు పులకించిపోతుంది.... ఉద్యాన వనాల్లో సప్తవర్ణశోభితమైన పుష్పాలపై సీతాకోక చిలుకలు కొత్తగా రెక్కలు విప్పుకుని చేసే విన్యాసాలు అద్భుతంగా ఉంటాయి. ప్రకృతిలో మమేకమై పుష్పాల్లో మకరందాన్ని ఆస్వాదిస్తూ ఆనందంగా విహారించే ఈ దృశ్యాలు స్థానిక నల్లపాడు రైల్వేస్టేషన్ ఉద్యానవనంలో సోమవారం ఉదయం కనువిందు చేశాయి.

-గుంటూరు, ఆంధ్రజ్యోతి



నరసరావుపేటలో ప్రత్యేక ఆధార్ క్యాంపులు

నరసరావుపేట రూరల్, నవంబరు 18: (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రకాష్ నగర్-2 సచివాలయం, రంగస్ట్రీట్- 2 సచివాలయంలో రెండు ప్రత్యేక ఆధార్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు మునిసిపల్ కమిషనర్ తెలిపారు. ఆధార్ కార్డులో మార్పులు, చేర్పులు, 0-18 సంవత్సరాలలోపు పిల్లల ఆధార్ డాక్యుమెంట్స్, బయోమెట్రిక్ అప్డేడ్, అడ్రస్, జిల్లాల మార్పులను చేసుకోవాలన్నారు. ఆధార్ క్యాంపులు ఈ నెల 19నుంచి 22వరకు, 26 నుంచి 29వ తేదీ వరకు ఈ ప్రత్యేక సెంటర్లు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

జోన్ డైరీ

● బొల్లాపల్లి: మండలంలోని కనమలచెరువులో నాసరయ్య తిరునాళ్ళ మంగళవారం ఘనంగా నిర్వహించనున్నారు. సాయంత్రం రెండు భారీ విద్యుత్ ప్రభలు, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయనున్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్స్‌కు ఆటల పోటీలు

నరసరావుపేట రూరల్, నవంబరు 18: నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో 77వ ఎన్‌సీసీ డే సందర్భంగా ఎన్‌సీసీ క్యాడెట్స్‌కు ఆటల పోటీలు నిర్వహించారు. పోటీలను కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు, కళాశాల వైస్ చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి, కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ మిట్టపల్లి రమేష్‌బాబు ప్రారంభించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.సునీల్, కళాశాల ఏవో శ్రీధర్, ఏఏవో అనిల్, పీడీ కృష్ణారెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు ఆంజనేయులు, విజయ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రేరణ తరగతులు

లింగరావుపాలెం (యడ్లపాడు), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగారావుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రేరణ (మోటివేషన్) తరగతులు నిర్వహించారు. సోమవారం పాఠశాలలో నిర్వహించిన ఈ ప్రేరణ తరగతులకు మనో వైజ్ఞానికశాస్త్ర నిపుణుడు, కారుచోల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.సుగంధరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటరామిరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

కృష్ణవేణి డిగ్రీ విద్యార్థులకు ఉద్యోగాలు

నరసరావుపేట టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థులు ఐదుగురు టీసీఎస్‌లో ఉద్యోగాలకు ఎంపిక అయ్యారని ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. అక్టోబరు 11న టీసీఎస్ కంపెనీ బీకామ్ విద్యార్థులకు క్యాంపస్ డ్రైవ్ నిర్వహించింది.

డ్వాక్రా మహిళల కుటుంబ వివరాలు నమోదు చేయాలి: ఏపీఎం వాసుబాబు

శావల్యాపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళల జీవనోపాధులను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఎస్‌హెచ్‌జీ ఇన్‌కం సర్వేని గ్రామాల్లోని వీవోఏలంతా సమర్ధవంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని మండల సమాఖ్య ఏపీఎం గుమ్మడిల్లి వాసుబాబు అన్నారు. మండలంలోని వేల్పూరులో జరుగుతున్న ఎస్‌హెచ్‌జీ ఇన్‌కం సర్వేని సోమవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వీరితోపాటు సీసీలు ఖాజావలి, కరుణమ్మ, మేరీకుమారి, అకౌంటెంట్ వెంకాయమ్మ పాల్గొన్నారు.

విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన

నరసరావుపేట లీగల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని ఎస్‌ఎస్‌ఎన్ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు సైబర్ నేరాలపై, డ్రగ్స్, ర్యాగింగ్ తదితర అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు సైబర్ నేరాలు ఆత్మహత్యలు ఇతర సమస్యలపై విశ్లేషణాత్మకంగా చర్చించారు. విద్యార్థుల ఆత్మహత్యలు నివారించడానికి వారి నడవడికను ఉపాధ్యాయులు గమనించాలన్నారు. కళాశాలల్లో విద్యార్థుల ఆత్మహత్యలు బాధాకరమన్నారు. సమాజ సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పరిపాలన అదనపు ఎస్పీ జైవీ సంతోష్, డీఈవో నీలావతిదేవి, డీఎస్పీ నాగేశ్వరావు సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ జోన్

అదుపులో కంప్యూటర్ల దొంగలు..?

ఈపూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొచ్చెర్ల హైస్కూల్, కొండ్రముట్ల సచివాలయం, రైతు సేవాకేంద్రం, హెల్త్ క్లినిక్ కేంద్రాలలో కంప్యూటర్లను చోరీ చేసిన వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. కొచ్చెర్లలో కారంపూడి రోడ్డు పక్కన బడ్డీ కొట్టు వద్ద మరో చోరీకి పాల్పడుచుండగా గమనించి పట్టుకున్నట్లు తెలిసింది. బొల్లాపల్లి మండలానికి చెందిన ఇద్దరు, శ్రీకాకుళంకు చెందిన యువకుడు కలిసి దొంగతనాలకు పాల్పడుతున్నట్లు విచారణలో చెప్పినట్లుగా తెలిసింది.

అక్రమంగా మద్యం కలిగి ఉన్న ఇద్దరి అరెస్టు

ఈపూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం కలిగి ఉన్న ఇద్దరి వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఈపూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ డీ వెంకటేశ్వర్లు సోమవారం సాయంత్రం తెలిపారు. ఈపూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని రొంపిచర్లకు చెందిన జీ సుబ్బారెడ్డి, పీ కృష్ణారెడ్డిలు అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా పట్టుకొని వారి వద్ద ఉన్న 42 మద్యం సీసాలు, సుమో స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా రొంపిచర్ల మండలం కొత్తపల్లికి చెందిన వెంకటేశ్వర్లు, చాకలికుంటకు చెందిన పీకా నాయక్‌లను అక్రమ మద్యం కేసులో తహసీల్దారు వద్ద హాజరుపరచి బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రీ సర్వే తో డీకే పట్టా రైతులకు అవస్థలు

● ఎల్‌పీఎం నంబరు కేటాయించక నిలిచిన రుణాల రెన్యూవల్
● రుణాలు చెల్లించాల్సిందేనని బ్యాంకర్ల ఒత్తిడి



ప్రభుత్వం ఇచ్చిన పట్టాదారు పాసుపుస్తకాలు చూపుతున్న ఎస్టీ రైతులు

ఈపూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పంపిణీ చేసిన భూమి ఉంది. కాని ఆ భూమిపై పంట రుణాలు తీసుకోవడానికి వీలులేకుండా పోయింది. దాంతో పెట్టుబడికి డబ్బులు లేక తీసుకున్న రుణం చెల్లించలేక నిరుపేదలైన ఎస్సీ ఎస్టీ బీసీ రైతులు అల్లాడుతున్నారు. గతంలో ప్రభుత్వాలు ఎస్సీ ఎస్టీ, బీసీ పేద రైతులకు భూములను పంపిణీ చేశాయి. మండలంలోని సుమారు వెయ్యి ఎకరాల్లో, గుండేపల్లిలో సుమారు 350 ఎకరాల్లో ఎస్సీ, ఎస్టీలకు భూములపై హక్కు కల్పిస్తూ డీకే పట్టాలను, పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేశారు. అప్పటి నుంచి రైతులు ఆ భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. క్రమేపీ ఆ భూములకు బ్యాంకులు రుణాలు కూడా ఇస్తున్నారు. పంటల సాగుకోసం రైతులు పట్టాదారు పాసు పుస్తకాలను బ్యాంకులో పెట్టి పెట్టుబడి కోసం పంట రుణాలు తీసుకొని మరలా చెల్లిస్తూ వస్తున్నారు. అయితే గత ప్రభుత్వం భూములను రీ సర్వే చేసింది. రీ సర్వే చేసిన భూములకు సర్వే నంబర్‌కు బదులు ఎల్‌పీఎం నంబరు ఇచ్చారు. కానీ పట్టాదారు భూములకు ఎల్‌పీఎం నంబర్లు ఇచ్చారు. ప్రభుత్వం ఇచ్చిన అసైన్డ్ భూములకు ఎల్‌పీఎం నంబరు ఇవ్వలేదు. దాంతో నిరుపేదలకు పంపిణీ చేసిన ప్రభుత్వ భూములకు అడంగల్, 1బీ నిలిచిపోయాయి. దాంతో బ్యాంకులో తీసుకొన్న పంట రుణాలను రెన్యూవల్ చేయడానికి వీలులేకుండా పోయింది. బ్యాంకు అధికారులు మాత్రం పంట రుణాలు చెల్లించాలని రైతులపై ఒత్తిడి తెస్తున్నారు. దాంతో ఏమి చేయాలో పాలుపోని రైతులు ఉన్నతాధికారులకు విన్నవించుకున్నారు. మండలంలో సుమారు వెయ్యి ఎకరాలు ప్రభుత్వ భూములకు ఎల్‌పీఎం నంబర్లు ఇవ్వలేదు. గుండేపల్లి, వనికుంట, ఈపూరు, కొండాయిపాలెం రెవెన్యూ గ్రామాలలో ఎక్కువమంది రైతులు ప్రభుత్వ భూములపై హక్కుపొంది సాగు చేసుకుంటున్నారు.

బ్యాంకు అధికారులు లోన్ కట్టమంటున్నారు

● వేటగిరి చిన ఆంజనేయులు



రీ సర్వే చేసిన తరువాత అడంగల్ 1బీ రావడం లేదు. దాంతో బ్యాంకులో తీసుకున్న పంట రుణాలను రెన్యూవల్ చేసుకోవడానికి వీలులేకుండా పోయింది. 1984 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం 2 ఎకరాలు ప్రభుత్వ భూమిని పంపిణీ చేసింది. ఆ భూమిని సాగు చేసుకుంటూ జీవిస్తున్నాం. బ్యాంకులో రూ.1లక్ష పంట రుణం తీసుకున్నాను. ఇప్పుడు బ్యాంకు అధికారులు తీసుకున్న రుణం చెల్లించాలని ఒత్తిడి తెస్తున్నారు.

అధికారులకు విన్నవించుకున్నా ఫలితంలేదు

● పల్లె ఇస్సాకు



ప్రభుత్వం 1991 సంవత్సరంలో రెండు ఎకరాల భూమిని ప్రభుత్వం పంపిణీ చేసింది. అప్పటి నుంచి ఆ భూమిని సాగు చేసుకుంటూ జీవిస్తున్నాం. రీ సర్వేతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. పంట సాగు చేసుకోలేని పరిస్థితి ఏర్పడింది. బ్యాంకు అధికారులు లోన్ కట్టమంటున్నారు. ఏమి చేయాలో అర్థం కాని పరిస్థితి.

శివాలయాల్లో వైభవంగా కార్తీక అభిషేకాలు

నరసరావుపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శివాలయాల్లో కార్తీకమాస వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. కార్తీక సోమవారం పురస్కరించుకొని శివునికి రుద్రాభిషేకాలు వైభవంగా నిర్వహించారు. ఆలయాల ప్రాంగణాల్లో పెద్ద ఎత్తున దీపారాదనలు చేశారు. గంగా పార్వతి సమేత భీమలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామికి అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. బరంపేటలోని వాయుమల్లేశ్వర స్వామి ఆలయం, శృంగేరి శంకర మఠంలో చంద్రమౌళీశ్వర స్వామికి, లింగంగుంట్ల శివాలయం, బాలయ్య నగర్ శివాలయంలో అభిషేకాలు జరిగాయి. పల్నాడు రోడ్డులోని సత్యనారాయణ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజుల జరిగాయి. మహాశివుని విగ్రహం వద్ద భక్తులు దీపారాధనలు చేశారు.

● నరసరావుపేట అర్బన్: పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలోని మునిసిపల్ కార్యాలయ ప్రాంగణంలోని కళ్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ ఆవరణలోని కామేశ్వర స్వామికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు.

● రొంపిచర్ల: మండలంలోని రొంపిచర్ల, వడ్లమూడివారిపాలెం, విప్పర్ల, గోగులపాడు గ్రామాల్లోని శంకర స్వామి, నీలకంఠేశ్వర స్వామి, వల్లభేశ్వర స్వామి, చంద్ర మౌళీశ్వర స్వామి, వెంకటేశ్వర స్వామి ఆలయాలతో పాటు మిగిలిన ఆలయాల్లో కార్తీకమాసం సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. రొంపిచర్లలోని నందీశ్వరుడు, ధ్వజ స్తంభం వద్ద దీపాలను వెలిగించారు.

● బొల్లాపల్లి : మండలంలోని వెల్లటూరు, పేరూరుపాడు, బొల్లాపల్లి, వడ్డెంగుంట, గుమ్మనంపాడు, మేళ్ళవాగు తదితర గ్రామాల్లో కార్తీక సోమవారం పూజలను ఘనంగా నిర్వహించారు. వెల్లటూరులో గంగా పార్వతి సమేత సోమేశ్వర స్వామి ఆలయంలో మహిళలు పెద్దఎత్తున తరలివచ్చి కార్తీక దీపారాధనలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు, అయ్యప్ప దీక్షా స్వాములతో ఆయా గ్రామాల్లోని దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

● వినుకొండ టౌన్ : కార్తీక మాసం మూడో సోమవారం సందర్భంగా పట్టణంలోని పాత శివాలయం, కపటేశ్వరాలయం, మంజునాథ ఆలయం, లలితసోమేశ్వర స్వామి దేవాలయాల్లో కార్తిక దీపారాధనలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. పాత మార్కెట్ బజారులోని శంకర్ మఠంలో యడవల్లి శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో 1126 రుద్రాక్షలతో సప్తలింగార్చన, మహన్యాస పూర్వక రుద్రాబిషేకాలు నిర్వహించారు.



విశేష అలంకారంలో వినుకొండ మంజునాథస్వామి



నరసరావుపేటలో భీమలింగేశ్వర స్వామి

కూటమి ప్రభుత్వంలో పంచాయతీలకు పూర్వ వైభవం

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన అనంతరం పంచాయతీలకు పూర్వ వైభవం రాబోతుందని మాజీమంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. అసెంబ్లీలో సోమవారం జరిగిన చర్చలో వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం పెండింగ్ పెట్టిన నిధులను దశలవారీగా విడుదల చేయటంతో పాటు సర్పంచ్‌ల గౌరవం పెంచేలా చర్యలు చేపట్టడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లకు ప్రత్తిపాటి ధన్యవాదాలు తెలిపారు. తాజాగా బడ్జెట్‌లో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధికి రూ 16,739 కోట్లు కేటాయించటం కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం అన్నారు. చిలకలూరిపేట నుంచి గెలిచి ఆరోగ్యశాఖ మంత్రి రజిని కనీసం తన సొంత నియోజక వర్గంలో వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రికి కాంపౌండ్ వాల్ కూడా కట్టించలేకపోయిందని ప్రత్తిపాటి విమర్శించారు. చిలకలూరిపేటలో గిరిజన బాలుర హాస్టల్ అధ్వానంగా మారిందని, హాస్టల్ బాగుచేసేందుకు నిధులు కేటాయించాలని కూడా పుల్లారావు విజ్ఞప్తి చేశారు.

క్యాన్సర్ పరీక్షలపై ప్రత్యేక దృష్టిని సారించాలి: జిల్లా నోడల్ అధికారి

శావల్యాపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో క్యాన్సర్‌వ్యాధి లక్షణాలున్న వారిని గుర్తించి వారికి సకాలంలో వైద్య పరీక్షలు నిర్వహించాలని జిల్లా నోడల్ అధికారి హనుమకుమార్ అన్నారు. ఎన్‌సీడీ సర్వే 3.0ని పర్యవేక్షణ చేసేందుకు సోమవారం ఆయన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఎన్‌సీడీ సర్వే పురోగతి, సర్వే తీరును వైద్యాధికారి రాధాకృష్ణన్‌ను అడిగి తెలుసుకున్నారు.

కోటప్పకొండకు టీడీపీ నాయకుల పాదయాత్ర

రొంపిచర్ల, నరసరావుపేట రూరల్ నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కర్లకుంట గ్రామం నుంచి నరసరావుపేట మండలంలోని కోటప్పకొండకు పాదయాత్రను సోమవారం నిర్వహించారు. పార్టీ నాయకులు వడ్లమూడి వెంకట కిషోర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. పాదయాత్రలో రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి నల్లపాటి రాము, టీడీపీ నేత కొల్లి బ్రహ్మయ్యలు ప్రారంభించారు. సోమవారం సాయంత్రం పాదయాత్ర కోటప్పకొండకు చేరుకుంది. వీరిని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు కిషోర్‌ను అభినందించారు.

నూతన జాతీయ విద్యావిధానంతో పేదలకు అందని విద్య

● ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు, విద్యార్థులు

నరసరావుపేట టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం తీసుకువచ్చిన నూతన జాతీయ విద్యా విధానంతో పేదలకు విద్య అందని దాక్షలా తయారవుతుందని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే శివారెడ్డి అన్నారు. సోమవారం నరసరావుపేట పట్టణం సీపీఐ కార్యాలయంలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య పల్నాడు జిల్లా ప్రథమ మహాసభ నిర్వహించారు. పంజాబ్ బ్యాంక్ సెంటర్ నుంచి సీపీఐ కార్యాలయం వరకు వందలాది మంది విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. సమావేశానికి అతిథులుగా సీపీఐ జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్, సహాయ కార్యదర్శి కాసా రాంబాబు పాల్గొన్నారు. అనంతరం ఏఐఎస్‌ఎఫ్ నూతన జిల్లా అధ్యక్షుడిగా నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా మధు, కోశాధికారిగా కాసా గోపికృష్ణ, ఉపాధ్యక్షులుగా దాసరి హేమంత్, రాజా, సహాయ కార్యదర్శులుగా వాగ్య నాయక్, అభిషేక్, బోధన శ్రీనివాసరావులను, 21మంది సమితి సభ్యులతో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

రీసర్వేలో జరిగిన అక్రమాలపై విచారణ జరిపించండి

శావల్యాపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రీసర్వేలో స్థానిక రెవెన్యూ అధికారులు చేసిన అక్రమాలపై విచారణ జరిపించి తనకు న్యాయం చేయాలని మండలంలోని పిచికలపాలెం గ్రామానికి చెందిన రైతు గాలి వెంకటేశ్వర్లు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కారం కార్యక్రమంలో తహసీల్దార్ సుజాతకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

నిరుపేదలకు ఇంటి స్థలాలను కేటాయించాలి: సీపీఐ

వినుకొండ, నవంబర్ 18 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఇల్లు లేని నిరుపేదలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని సీపీఐ రాష్ట్ర సమితి ఇచ్చిన పిలుపులో భాగంగా నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో నిరుపేదలకు ఇంటి స్థలాలను ఇవ్వాలంటూ మున్సిపల్ పరిధిలోని పలు సచివాలయల్లో అధికారులకు సోమవారం వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతివరప్రసాద్, పఠాన్ లాల్‌ఖాన్, బి.చిన్న, బి.శ్రీనివాసరావు, వి.రాము, పి.వెంకటేశ్వర్లు, కిషోర్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఫిర్యాదు పరిష్కారం కావాలి: కలెక్టర్ అరుణ్ బాబు



కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఆశా వర్కర్లు

నరసరావుపేట టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చే ప్రతి ఫిర్యాదు పరిష్కారం కావాలని పల్నాడు జిల్లా కలెక్టర్ పీ అరుణ్ బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం నరసరావుపేటలోని పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఆధ్యక్షతన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. జిల్లాలోని సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన 48 అర్జీలను కలెక్టర్, ఇతర అధికారులకు అందజేశారు. రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ రాజ్యాంగ వ్యతిరేకం కమిషన్ అని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గోదా జాన్‌పాల్ సోమవారం నరసరావుపేటలోని కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ పీ అరుణబాబుకు వినతి పత్రం అందజేశారు. గత ప్రభుత్వంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలకు జోవోలు ఇవ్వాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. సోమవారం ఆశా వర్కర్స్ సమస్యల పరిష్కారం కోసం కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు.

సమస్యలను త్వరితగతిన పరిష్కరించండి: ఎస్పీ శ్రీనివాసరావు

నరసరావుపేట లీగల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక కు వచ్చే ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించవలసిందిగా సంబంధిత పోలీస్ అధికారులకు ఎస్పీ కంచి శ్రీనివాస్ రావు సోమవారం ఆదేశాలు జారీచేశారు. సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమంలో వివిధ అంశాలకు సంబంధించి ఎస్పీకి 60 ఫిర్యాదులు అందాయి. బొల్లాపల్లి మండలం గండిగనుమల గ్రామానికి చెందిన కేశవత్ సూర్య నాయక్ అనే వ్యక్తి తన భార్యకు ఉద్యోగం ఇప్పిస్తానని కొమ్ముపవన్ కుమార్ డబ్బులు తీసుకుని మోసం చేసినట్లు ఫిర్యాదుచేశాడు. బొల్లాపల్లి మండలం వెంకటరెడ్డి పురం గ్రామానికి చెందిన వాడితే నాయక్ నాయకత్వం ఏటీఎంలో డబ్బులు తీసుకోవడానికి వినుకొండలో ఓ ఏటీఎంకు వెళ్లి ఓ అపరిచితుడికి ఏటీఎం కార్డు ఇచ్చానని ఆ వ్యక్తి పనిచేయని ఏటీఎం కార్డుని ఇచ్చి అక్రమంగా రూ.90,000 డ్రా చేసుకొని మోసం చేసినట్లు ఎస్పీకి ఫిర్యాదుచేశాడు.

108 అంబులెన్స్‌ల సిబ్బంది సమస్యలను పరిష్కరించాలి

నరసరావుపేట రూరల్, నవంబరు 18: (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 108 సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని నరసరావుపేట లోని గాంధీ పార్క్ దగ్గర సిబ్బంది రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సందెపోగు శరత్ కుమార్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు నాయక్, సిలార్, జిల్లా నాయకులు జిల్లా ప్రెసిడెంట్ పాపారావు, వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్ రాష్ట్ర కమిటీ మెంబర్ భాషా, నారాయణ తదితర జిల్లా ఎంప్లాయీస్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై ఎల్‌ఐసీ ఏజెంట్ల ఆగ్రహం

వినుకొండ, నవంబర్ 18 (ఆంధ్రజ్యోతి): ఎల్‌ఐసీలో పాలసీదారులకు, ఏజెంట్లకు వ్యతిరేకంగా వస్తున్న మార్పులపై ఎల్‌ఐసీ (ఏజెంట్ల ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా) ఏవోఐ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక బ్రాంచ్ కార్యాలయం వద్ద సోమవారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఏవోఐ బ్రాంచ్ అధ్యక్షులు బొంకూరి వెంకటేశ్వర్లు, సన్నిగంటి కోటేశ్వరరావు, అంబటి ఐరామమూర్తి, నరసింహారావు, గల్ల సీతరామయ్య, రవ్వయ్యబ్రహ్మయ్య రాములురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వజ్రగిరి జస్టిస్‌కు పట్టాభి సీతారామయ్య అవార్డు

వినుకొండ టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వినుకొండకు చెందిన చిత్రకారుడు వజ్రగిరి జస్టిస్‌కు పట్టాభిసీతారామయ్య అవార్డుకు ఎంపికైనట్లు సోమవారం ఒక ప్రకటనలో జస్టిస్ తెలిపారు. సీతారామయ్య కళాపీఠం ద్వారా అవార్డుకు ఎంపిక కావడం సంతోషాన్ని ఇచ్చిందని ఆయన తెలిపారు. ఈ నెల 24వ తేదీన గుంటూరు జరిగే కార్యక్రమంలో ఈ అవార్డు అందుకోనున్నట్లు తెలిపారు.

ఉపాధి హామీ పనుల ఆమోదానికి గ్రామసభలు

శావల్యాపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను గ్రామాలలో గుర్తించిన అభివృద్ధి పనులను ప్రజలకు తెలియజేసి వారి నుంచి ఆమోదాన్ని పొందేందుకు మండలంలోని కనమర్లపూడి, శావల్యాపురం గ్రామాలలో ఉపాధి హామీ గ్రామసభలను మంగళవారం నిర్వహించారు. 76అభివృద్ధి పనులను గుర్తించినట్లు ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య తెలిపారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా తెలుగు రైతు ఉపాధ్యక్షులు గోరింట్ల హనుమంతరావు, సర్పంచ్ తన్నీరు భారతి, ఇన్‌చార్జి సర్పంచ్ యాగసిరి చెన్నమ్మ, ఏపీవో రామారావు, టీఏ బేబీరోజ, పంచాయతీ కార్యదర్శి యాకోబు పాల్గొన్నారు.

సివిల్స్ పరీక్షలకు ఉచిత శిక్షణ

నరసరావుపేట కల్చరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): యూపీఎస్సీ సివిల్స్ - 2024 ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలకు ఉచిత శిక్షణ కోసం జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగ అభ్యర్థులు ఈ నెల 24వలోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా బీసీ సంక్షేమ, సాధికారిత అధికారి బి.శివనాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాల కోసం 9010497267, 9441630075 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

● సీడీపీవో ముదివర్తి అనూరాధ

ఫటా ఫట్



శావల్యాపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల వద్ద మౌలిక వసతులను ఏర్పాటుచేసి విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని సీడీపీవో ముదివర్తి అనూరాధ ఆంధ్రజ్యోతికి తెలిపారు.

ప్రశ్న: ఎన్ని అంగన్‌వాడీ కేంద్రాల వద్ద మౌలిక వసతులున్నాయి?

జ: వినుకొండ నియోజకవర్గంలో 234 అంగన్‌వాడీ కేంద్రాలుండగా వాటిలో 49 కేంద్రాలకు శాశ్వత భవనాలున్నాయి. వాటిలో 25 కేంద్రాల వద్ద మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాలు కల్పిస్తున్నాం.

ప్రశ్న: అంగన్‌వాడీ కేంద్రాల శాశ్వత భవనాలకు భూ సేకరణ చేసి, నిర్మాణాలు ప్రారంభించకపోవటానికి కారణమేంటి ?

జ: నియోజకవర్గంలో 185 అంగన్‌వాడీ కేంద్రాలకు శాశ్వత భవనాలు నిర్మించేందుకు వైసీపీ ప్రభుత్వ హయాంలో రెవెన్యూ శాఖ ద్వారా భూసేకరణ చేశారు. నిర్మాణాలకు నిధులు విడుదల చేయకపోవడంతో నిలిచిపోయాయి.

ప్రశ్న: అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థుల సంఖ్య తగ్గటానికి కారణాలేంటి ?

జ: దేశవ్యాప్తంగా జనాభా తగ్గుదల వల్లనే అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే విద్యార్థుల సంఖ్య కూడా క్రమేపీ తగ్గుతోంది.

ప్రశ్న: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్స్ నిర్వహణ ఎలా ఉంది ?

జ: నియోజకవర్గంలోని 14 అంగన్‌వాడీ కేంద్రాలను ప్రో-లోకేటెడ్ కేంద్రాలుగా మార్చాం. అవి ప్రభుత్వ పాఠశాలల్లోనే నిర్వహిస్తున్నారు. మిగిలిన అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్స్‌ను నిర్వహించడం జరుగుతుంది.

ప్రశ్న: అంగన్‌వాడీ కేంద్రాల్లో సమస్యలు ఏమి ఉన్నాయి ?

జ: అంగవాడీ కేంద్రాలకు రేషన్‌బియ్యం సకాలంలో అందించకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గ్రామాల్లోని గర్భిణులు, బాలింతలు భోజనానికి అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చేందుకు ఆసక్తి చూపకపోవడంతో రేషన్‌ను ఇళ్ళ వద్దనే అందజేస్తున్నాం.

ప్రశ్న: ప్రీ స్కూల్స్‌లో విద్యార్థులకు సౌకర్యాలు ఎలా ఉన్నాయి ?

జ: ప్రీ స్కూల్స్‌కు వచ్చే విద్యార్థులకు నాణ్యమైన ఆటవస్తువులను అందించి ప్రభుత్వం ఎంతో ప్రోత్సహిస్తోంది. మధ్యాహ్న పౌష్టికాహారాన్ని అందిస్తున్నాం.

పాఠశాల వద్ద తక్కువ ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్



వినుకొండ పట్టణంలోని ఎస్‌ఎస్‌పీ కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్, ఫీజుల బోర్డు తక్కువ ఎత్తులో ఉండటం వలన ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఈ ట్రాన్స్‌ఫార్మర్ జీఎంసీ బాలయోగి బాలికల గురుకుల పాఠశాలకు ఆనుకొని ఉంది. ఇది జనసంచారం ఎక్కువ ఉన్న ప్రదేశం. ఈ సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు. - వినుకొండ, ఆంధ్రజ్యోతి

వైసీపీ ప్రభుత్వంతో 20 సంవత్సరాలు వెనక్కి: ప్రత్తిపాటి



చిలకలూరిపేట అర్బన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ నిర్వాకాలతో చిలకలూరిపేట పురపాలక సంఘం అభివృద్ధి 20 సంవత్సరాలు వెనక్కు వెళ్లిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణ పరిధిలో ఉన్న పలు సమస్యలపై ప్రజా ప్రతినిధులు, అధికారులతో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మైలవరపు గుండయ్య మునిసిపల్ కౌన్సిల్ హాల్‌లో సోమవారం సమీక్ష నిర్వహించారు. సమావేశంలో పలువురు కౌన్సిలర్లు వారి వార్డుల్లో ఉన్న ప్రధాన సమస్యలను ప్రత్తిపాటి దృష్టికి తీసుకువచ్చారు. ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా వార్డుల్లో పనులన్నీ ఒకేసారి చేయించలేకపోయినప్పటికీ ఉన్న నిధులతో ప్రతి వార్డులో ఐదు లక్షల రూపాయల బడ్జెట్‌కు మించని పనులు ముందుగా ప్రతిపాదిస్తే తక్షణమే పనులను పూర్తి చేయిస్తానని ప్రత్తిపాటి తెలిపారు. నియోజకవర్గానికి రూ.4,500 కోట్లతో పనులు చేపడితే గత ఐదేళ్లలో సదరు పనులను అసమర్థ ప్రభుత్వంలో ముందుకు సాగనివ్వలేదని ప్రత్తిపాటి అన్నారు. సమావేశంలో మునిసిపల్ చైర్మన్ షేక్ రఫానీ, జనసేన సమన్వయకర్త తోట రాజా రమేష్, కమిషనర్ పీ శ్రీహరి బాబు, డీఈ రహీం, విద్యుత్ ఏడీఈ అశోక్ కుమార్, టీపీఎస్ సుజాత, కౌన్సిలర్లు, పట్టణ పార్టీ అధ్యక్షుడు పఠాన్ సమద్‌ఖాన్, పార్టీ నేతలు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేత



పేద విద్యార్థులకు బహుమతి ప్రదానం చేస్తున్న కాకతీయసేవా సమాఖ్య నాయకులు

చిలకలూరిపేట, నవంబర్ 18 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట నియోజకవర్గ కాకతీయ సేవా సమితి ఆధ్వర్యంలో బొప్పూడి ప్రసన్నాంజనేయ స్వామి వారి కళ్యాణ మండపంలో సోమవారం కార్తీక వనభోజన మహోత్సవాన్ని నిర్వహించారు. 21 మంది పేద విద్యార్థులకు రూ.5 వేల చొప్పున ఉపకార వేతనాలను పంపిణీ చేశారు. ఆంధ్రప్రదేశ్ కాకతీయ సేవా సమాఖ్య ఉపాధ్యక్షుడు ముత్తవరపు సురేష్‌బాబు సహకారంతో సుమారు 1,100 మందికి భోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోట్రు పూర్ణచంద్రరావు, దండా గోపీల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సతీమణి ప్రతిపాటి వెంకట కుమారి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కందిమళ్ళ జయమ్మ పాల్గొన్నారు. సమితి స్థల దాత గుంటు మస్తానయ్యతో పాటు కాకతీయ సేవా సమాఖ్య రాష్ట్ర నాయకులు వెలగపూడి గోపాలకృష్ణ ప్రసాద్, బెజవాడ వెంకట్రావు, మురకొండ బోసుబాబు, ముత్తవరపు సురేష్‌బాబు, వెలగా కోటేశ్వరరావు, పెంటేల బాలాజి, బీజేపీ నేత యడ్లపాటి స్వరూపరాణి పాల్గొన్నారు.

బిల్లు లేకుండా మెటల్ తరలిస్తున్న ట్రాక్టర్ అడ్డగింత

యడ్లపాడు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పల్లె పండుగ కార్యక్రమాలలో భాగంగా మండలంలోని 18గ్రామ పంచాయతీల పరిధిలో సుమారు రూ.2.5కోట్ల ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో 24సీసీ రోడ్ల నిర్మాణానికి టీడీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మండలంలోని మైదవోలులో ఆర్‌సీఎం చర్చి వద్ద నుంచి ఎస్సీ కాలనీ వరకు రూ.12లక్షలతో సీసీ రోడ్డు వేసేందుకు అంచనాలు రూపొందించారు. పనులు నిర్వహించేందుకు కాంట్రాక్టర్ అవసరమైన మెటల్‌ను క్వారీ నుంచి ట్రాక్టర్‌తో తరలిస్తున్న సమయంలో ఏఎంఆర్ సంస్థకు చెందిన సూపర్ వైజర్ ట్రాక్టర్‌ను అడ్డుకున్నాడు. మైనింగ్ బిల్లులు తీసుకోకుండా మెటల్ తరలించేందుకు వీలులేదన్నాడు. గ్రామ టీడీపీ నాయకుడు ప్రభుత్వ పనులకు మైనింగ్ బిల్లు తీసుకోవలసిన అవసరం లేదని, పీఆర్‌ఏఈ ఇచ్చిన లేఖను చూపాడు. అయితే సూపర్‌వైజర్ మాత్రం ఏఈ ఇచ్చిన లేఖ చెల్లదని, సీనరేజి చెల్లించాల్సిందేనని పట్టుబట్టాడు. ఈ విషయమై పంచాయతీ రాజ్ ఏఈ, ఈఈలను వివరణ అడుగగా ఏఈ అవసరం లేదని తెలుపగా, ఈఈ మాత్రం తొలుత చెల్లించాలంటూ తెలిపి తరువాత కాంట్రాక్టరు చూసుకోవాలని, తాము మాత్రం ఫైనల్ బిల్లులో సీనరేజి మినహాయించి మైనింగ్‌శాఖకు చెల్లిస్తామని తెలిపారు. శాఖల మధ్య సమన్వయ లోపంతో సమస్య తలెత్తింది.